వ్యవసాయంలోనూ అసమానతలే

- ఆదాయాలు అంతంత మాత్రమే
- అరకొరగా శాశ్వత ఆవాసాలు
- భూకమతాలూ తక్కువే
- వెనుకబడిపోతున్న ఎస్‌టి, ఎస్‌సి, ఒబిసిలు

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 19 | విజయవాడ, సోమవారం 19 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 19 August 2024 | Rs

6

అది మానని గాయం!

పారిస్ ఒలింపిక్స్‌పై వినేశ్ ఫొగాట్

కొత్త రేషన్ కార్డులెప్పుడు?

- ఏడాదిగా నిలిచిన జారీ
- సచివాలయాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి– గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఏడాదిగా నిలిచిపోయింది. 26 జిల్లాల పరిధిలో దాదాపు 2.40 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో దరఖాస్తు చేసి అప్పటి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వారు ఇప్పటికీ రేషన్ కార్డుల కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్తగా వివాహమైన వారికి వివాహ ధ్రువీకరణ పత్రం చూపిస్తే, కార్డులు ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ప్రకటించినా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇంకా వెలువడలేదు. కొత్త దరఖాస్తుల స్వీకరణ, గతంలో దరఖాస్తు చేసి అర్హత ఉందని కోడ్ నంబరు ఇచ్చిన వారికి జారీ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. గత వైసిపి ప్రభుత్వం ఏటా జులై, డిసెంబరుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు కార్డులను జారీ చేసింది.

గతేడాది జులైలో వరకూ ఈ ప్రక్రియ సాగింది. డిసెంబర్‌లో నిల్చిపోయింది. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో మొత్తం ప్రక్రియ ఆగిపోయింది. ఎన్నికల అనంతరం కొత్త కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాలేదు. కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించడం లేదు. గతంలో వేర్వేరు కారణాల వల్ల కార్డు కోల్పోయిన వారికి తిరిగి అర్హత సాధించినా దరఖాస్తుకు అవకాశం ఇవ్వడం లేదు. పెన్షన్ తీసుకుంటున్న రిటైర్డు ప్రభుత్వోద్యోగులు కార్డులో సభ్యుడిగా ఉంటే గతంలో బియ్యం కార్డు రద్దు చేశారు. కొంతకాలానికి సంబంధిత పెన్షన్‌దారుడు చనిపోయినా కుటుంబ సభ్యులకు కొత్త కార్డు ఇవ్వలేదు. అనర్హులను కార్డు నుంచి తొలగించినా అర్హులకు కార్డులో అవకాశం కల్పించలేదు. గతేడాది జగనన్న సురక్షలో బియ్యం కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న వారు దాదాపు లక్షకుపైగా ఉన్నాయి. 2021లో నవశకం సర్వే పేరుతో రాష్ట్రంలో ఏడు లక్షల రేషన్ కార్డులను వైసిపి ప్రభుత్వం తొలగించింది. వీటిలో 60 శాతం కార్డులను అర్హత ఉన్నా సాంకేతిక కారణాలు చూపి తొలగించారని విమర్శలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి అడుగుల స్థలంలో ఇల్లు ఉన్నా కార్డు తొలగించారు. విద్యుత్ బిల్లులు, ఐటి రిటర్నులు, నాలుగు చక్రాల వాహనం, ఇంట్లో మరో కుటుంబ సభ్యుడు ప్రభుత్వం నుంచి పింఛను తీసుకున్నా కార్డు నిలిపివేశారు. వీటి నుంచి మినహాయింపు పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు మోక్షం కలగలేదు. నూతనంగా వివాహం చేసుకున్న వారికి, గతంలో దరఖాస్తు చేసి అర్హులుగా గుర్తించబడిన వారికి వెంటనే కొత్త కార్డులు మంజూరు చేయాలని, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ డాక్టర్ పై హత్యాచారానికి వ్యతిరేకంగా

ఆందోళనలు ఉధృతం

● కొల్‌కతా ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీం ● రేపు విచారణ ● వైద్యుల బదిలీలను వెనక్కి తీసుకున్న బెంగాల్ ప్రభుత్వం

న్యూఢిల్లీ : కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి వ్యతిరేకంగా ఆదివారం దేశవ్యాప్తంగా ఆందోళనలు మరింత తీవ్రతరమయ్యాయి. నిరసనలు, ర్యాలీలతో పలు పట్టణాలు హోరెత్తాయి. కొల్‌కతా, ఢిల్లీతో పాటు అనేక నగరాల్లో వైద్యులు వీధుల్లోకి వచ్చి తమ నిరసనను తెలిపారు. మైసూర్ మెడికల్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు (ఎంఎంసిఐఆర్) చెందిన దాదాపు 200 మంది వైద్యులు, ఇతర సిబ్బంది నగరంలో ఊరేగింపు నిర్వహించారు. కెఆర్ ఆసుపత్రి ప్రాంగణం నుంచి గాంధీ కూడలి వరకూ ప్రధాన వీధుల గుండా ఈ ఊరేగింపు సాగింది. కొన్ని చోట్ల మానవ హారం నిర్మించారు. బెంగాల్ సినీ, క్రీడా రంగానికి చెందిన వారంతా ఈ అందోళనకు బాసటగా నిలిచారు. పుట్‌బాల్ మైదానంలో ప్రధాన ప్రత్యర్థులైన మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ జట్లు ఈ విషయంలో ఒక్కటయ్యాయి. బెంగాల్ సినిమా, టీవి పరిశ్రమకు చెందిన దాదాపు 200 మంది ఆదివారం నాటి ర్యాలీలో పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. ఈ ఉదంతాన్ని సుమోటోగా స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై మంగళవారం విచారణ చేపట్టనుంది. ఈ ఘటనపై కొల్‌కతా హైకోర్టు ఇప్పటికే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఆర్‌జి కర్ వైద్య కళాశాల ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను సిబిఐ అధికారులు వరుసగా మూడో రోజు ఆదివారం కూడా ప్రశ్నించారు. ఘోష్ కాల్ రికార్డులు సేకరించేందుకు సిబిఐ ప్రయత్నిస్తోంది. శనివారం సుమారు 13 గంటల పాటు విచారించిన సిబిఐ ఆదివారం కూడా ఘోష్‌ను ప్రశ్నించింది. అలాగే, ఈ ఘటనపై వదంతులు వ్యాపింపజేసినందుకు, ఆమె గుర్తింపును బయటపెట్టినందుకు బెంగాల్ పోలీసులు బిజెపి మాజీ ఎంపీ లాకెట్ ఛటర్జీకి, మరో ఇద్దరు ప్రముఖ వైద్యులకు సమన్లు జారీ చేశారు. మరోవైపు 42 మంది సీనియర్ వైద్యులను బదిలీ చేస్తూ ఇచ్చిన ఆదేశాలను బెంగాల్ ప్రభుత్వం రద్దు చేసింది. నిరసన తెలుపుతున్న వైద్యుల నుండి వచ్చిన ఒత్తిడి కారణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆసుపత్రి సమీపంలో బిఎన్‌ఎస్‌ఎస్‌లోని సెక్షన్ 163 కింద చట్ట విరుద్ధంగా విద్యార్థులు సమావేశం కాకూడదని పోలీసులు నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఆదివారం నుండి వారం రోజుల పాటు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి.

పని ప్రదేశాల్లో భద్రత, రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆందోళన చేస్తున్న మైసూర్ మెడికల్ కాలేజి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైద్యులు, జూనియర్ డాక్టర్లు

రెండు గంటలకొకసారి ఆందోళనలపై నివేదికను సమర్పించండి : కేంద్రం

కొల్‌కతా ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతరులు ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రాల్లోని శాంతి భద్రతలపై ప్రతి రెండు గంటలకొకసారి నివేదికలు అందించాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర పోలీస్ బలగాలను ఆదేశించింది. ఆందోళనలపై రెండు గంటల కొకసారి శాంతిభద్రతల మిగతా 2లో

చైనాతో బంధం మరింత బలోపేతం

- వియత్నాం అధ్యక్షుడు వెల్లడి
- మూడు రోజుల చైనా పర్యటన నిమిత్తం హాంకాంగ్ చేరుకున్న తో లామ్

5

రాళ్లఅనంతపురంలో భూ పోరాటం

- అడ్డుకునేందుకు పెత్తందారుల యత్నం
- సిపిఎం నాయకులపై దౌర్జన్యం

3

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

3

ఫ్రీ హోల్డ్ భూములపై ఫోకస్

- 'మీ భూమి –మీ హక్కు' పేరుతో గ్రామ సభలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్త సంచలనం సృష్టించిన మదనపల్లె ఫైల్స్ దగ్ధం ఘటన మరువకముందే తాజాగా తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయంలో ఫైల్స్‌ను సిబ్బంది కాల్చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలవరం భూసేకరణ, పునరావాసం అంశాల్లో భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్న వాటికి సంబంధించిన ఫైల్స్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికీ తమకు పరిహారం అందలేదని కొందరు నిర్వాసితులు ఈ కార్యాలయానికి వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలు బయటకు రాకుండా ఉండేందుకు ఫైల్స్ దహనం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఈ నెల 16, 17 తేదీల్లో విశాఖ జిల్లాలోని విశాఖ అర్బన్, రూరల్, భీమునిపట్నం మండలాల పరిధిలోని దసపల్లా, హయగ్రీవ, రామానాయుడు, శారదాపీఠం భూములతోపాటు ఎర్రమట్టి దిబ్బ ప్రాంతాలను రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా పరిశీలించారు. నిబంధనలు, ఉల్లంఘనలు జరిగినట్లు, ఫ్రీ హోల్డ్ పత్రాలు పొందిన వారిలో కొందరు అనధికారికంగా ఒప్పందాలు చేసుకున్నట్లు ఆయన గుర్తించారు. అలాగే అగ్రిగోల్డు భూముల కొనుగోలులో మాజీ మంత్రి జోగి రమేష్ కుమారునితో పాటు ప్రభుత్వ సర్వేయరు అరెస్టుతో ఏ క్షణంలో ఎవరి అరెస్టు ఉంటుందోననే ఆందోళన ఉద్యోగుల్లో గుబులు రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్, విలువైన భూములను కొందరు రాజకీయ నేతలకు అనుకూలంగా రికార్డులు మార్చారనే ఆరోపణలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో సెప్టెంబరు మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రెవెన్యూ గ్రామ సభలు (మీ భూమి– మీ హక్కు) సందర్భంగా ఏ ఉద్యోగిపై ఎటువంటి ఫిర్యాదు అందుతుందోననే ఆందోళన మండలస్థాయి, అంతకంటే దిగువ స్థాయి సిబ్బందిలో స్పష్టంగా కనబడుతోంది. టిడిపి కూటమి ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు వచ్చే అర్జీల్లో సగానికి పైగా భూములకు సంబంధించినవి కావడంతో ఈ విషయంపై నిగ్గు తేల్చుతామని ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. అసైన్డ్ భూమి కేటాయించి 20 సంవత్సరాలు దాటిన అసలైన లబ్ధిదారుడు పొజిషన్‌లో ఉంటే ఆయా భూములను నిషేధిత జాబితా నుంచి పెద్దయెత్తున తొలగించిన సంగతి తెలిసిందే. ఇందులో కొంతమేర 20 ఏళ్లు పూర్తికాని భూములను కూడా నేతలకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలకు విరుద్ధంగా రికార్డుల్లో భూ యజమానుల పేర్లు సైతం మార్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో అసైన్డ్, ఇనామ్ భూముల విషయంలో అక్రమాలు పెద్దయెత్తున జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. చాలాచోట్ల డి–పట్టాలను కూడా గిఫ్ట్‌గా ఇచ్చినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా గత ఐదేళ్ల కాలంలో అసైన్డ్, 22(ఎ), ఇనామ్ భూములు 13.59 లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆయా భూముల యజమానులకు భూ యాజమాన్య హక్కులను గత ప్రభుత్వం కల్పించింది. రెవెన్యూ గ్రామ సభల వల్ల ఆయా గ్రామాల్లో పేదల భూములు నేతలు, వారి అనుయాయులకు మిగతా 2లో

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

ప్రజాశక్తి– ముండ్లమూరు (ప్రకాశం జిల్లా)



బుచ్చిబాబు (ఫైల్)

ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన దొద్దాల బుచ్చిబాబు (40) అమెరికాలోని కాలిఫోర్నియాలో భారత కాలమాన ప్రకారం శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆయన అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వీకెండ్ కావడంతో ఫ్యామిలీతో సరదాగా బీచ్‌కు వెళ్లారు. అక్కడ తన కుమారుడితో కలసి కొలనులో ఈత కొట్టారు. కొద్దిసేపటి తర్వాత కుమారుడిని బయటకు పంపి బుచ్చిబాబు ఒక్కరే ఈత కొడుతూ అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందారు. అమెరికాలో తమ కుమారుడు చనిపోయినట్లు తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు బోరున విలపించారు. తమ కుమారుడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

ఫైళ్ల దగ్ధం కేసులో నలుగురు సస్పెన్షన్

- ఇద్దరికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి– రాజమహేంద్రవరం రూరల్

పోలవరం ఎడమ కాలువ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం కేసులో నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.కళాజ్యోతి, ఆఫీసు సబార్డినేట్ కె.రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్లు కె.నూకరాజు, కారం బేబిలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఉత్తర్వులిచ్చారు. డిప్యూటీ తహశీల్దార్లు ఎ.కుమారి, ఎ.సత్యదేవిలకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఫైళ్ల దగ్ధం ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా, ఫైల్స్ దగ్ధం కావడంపై ధవళేశ్వరం పోలీస్ స్టేషన్లో డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి ఫిర్యాదు చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

- మంత్రి కందుల దుర్గేష్

2

ఆహ్వానం



కామ్రేడ్ మోటూరు హనుమంతరావు 23వ స్మారక
ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ సభ
మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, విజయవాడ.
తేది : 20-08-2024 (మంగళవారం), ఉదయం 10 గంటలకు

ముఖ్య అతిథి, 44వ వార్షికోత్సవ సంచిక ఆవిష్కర్త
గౌ॥ కొలుసు పార్థసారధి
గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాల శాఖామాత్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

అధ్యక్షులు
గౌ॥ బి. తులసీదాస్, సంపాదకులు, ప్రజాశక్తి దినపత్రిక

విశిష్ట అతిథి
గౌ॥ కె.యస్. లక్ష్మణరావు, శాసన మండలి సభ్యులు

గౌరవ అతిథులు
గౌ॥ తెలకపల్లి రవి, ఛైర్మన్, ఎంహెచ్ అవార్డు ఎంపిక కమిటీ
గౌ॥ ప్రొఫెసర్ జి. అనిత, జర్నలిజం విభాగం అధిపతి, నాగార్జున యూనివర్సిటీ
గౌ॥ నల్లి ధర్మారావు, కవి, సీనియర్ పాత్రికేయులు

అవార్డుల పరిచయం
గౌ॥ వై. అచ్యుతరావు, సిజిఎం, ప్రజాశక్తి

ప్రజాశక్తి సాహితీ సంస్థ

ప్రైవేటు వారికి ఐఏఎస్‌లు

- 'లేటరల్ ఎంట్రీ'పై ముసురుకుంటున్న వివాదం
- రిజర్వేషన్లకు ఎగనామం
- కేంద్రం తీరుపై విమర్శల వెల్లువ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుతం దేశంలో పెద్దయెత్తున ఖాళీగా ఉన్న సివిల్ సర్వీస్ పోస్టులను మోడీ సర్కారు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పక్కన పెట్టి లేటరల్ ఎంట్రీ పేరుతో ఆరెస్సెస్ మనుషులతో నింపే పనిలో ఉంది. దీనిపై వివిధ రంగాలకు చెందిన నిపుణులు ఇప్పటికే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దొడ్డి దారి నియామకాలను తక్షణమే ఆపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. 24 కేంద్ర మంత్రిత్వ శాఖలలోని జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ వంటి 45 పోస్టులకు 'లేటరల్ ఎంట్రీ' ద్వారా భర్తీ ప్రక్రియ చేపట్టింది. యుపిఎస్‌సి పరీక్ష ద్వారా ఐఎఎస్‌లు అయినవారు కాకుండా.. సంబంధిత విభాగాల్లో ఉన్న నైపుణ్యం, అనుభవం ఆధారంగా బయటి వ్యక్తులతో ఈ పోస్టులను భర్తీ చేయడాన్నే లేటరల్ ఎంట్రీ అంటారు. . అంటే, కేంద్ర ప్రభుత్వంలోని విభాగాల్లో ఉన్నతస్థాయి పోస్టుల్లో రిజర్వేషన్లను పూర్తిగా గాలికొదిలేసి తమకు నచ్చిన వ్యక్తులను నియమించుకుంటారు. పాలనా యంత్రాంగం, ఆర్మీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు, రాజ్యాంగ పరంగా కీలకమైన సంస్థల్లో ఆరెస్సెస్ మనుషులను ఇప్పటికే చొప్పించిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఇప్పుడు సొంతంగా మెజార్టీ లేకున్నా అవే పద్ధతులను యథేచ్ఛగా కొనసాగిస్తోంది.

2018లో లేటరల్ ఎంట్రీ స్కీమ్ ప్రారంభించిన తరువాత ఇంత పెద్ద సంఖ్యలో బయటి వ్యక్తులతో భర్తీకి పూనుకోవడం ఇదే మొదటిసారి. యుపిఎస్‌సి జాయింట్ సెక్రెటరీల స్థాయిలో 10, డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్ల స్థాయిలో 35 పోస్టులను ఈ బ్యాక్‌డోర్ పద్ధతిలో భర్తీ చేస్తోంది. జూన్‌లో ఒక వార్తా సంస్థ నివేదించినదాని ప్రకారం.. కేంద్ర ప్రభుత్వంలో ఐఎఎస్ అధికారుల కొరతను ఎదుర్కోవటానికి పెద్ద సంఖ్యలో లేటరల్ ఎంట్రెంట్స్ అవసరమున్నదని సిబ్బంది, శిక్షణశాఖ పేర్కొంది. "అధిక సంఖ్యలో అధికారులను నియమించుకోవటానికి రెండు కారణాలు. ఒకటి, గవర్నెన్స్‌లో డొమైన్ నైపుణ్యాన్ని పరిచయం చేయటం, ఇది ఐఎఎస్ అధికారుల కొరతను పరిష్కరించడం కూడా" అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) అధికారి ఒకరు సెలవిచ్చారు.

నో రిజర్వేషన్

ఈ పథకానికి సంబంధించిన అతి పెద్ద అవరోధం రిక్రూట్ అయ్యే పోస్టులకు రిజర్వేషన్‌ను వర్తింపజేయకూడదనే ప్రభుత్వ నిర్ణయం. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్ వేదికగా స్పందించారు. ఇది రిజర్వేషన్లపై బిజెపి చేస్తున్న డబుల్ దాడి గా ఆయన అభివర్ణించారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి4 తరగతులను రిజర్వేషన్లకు దూరంగా ఉంచేందుకు బిజెపి ఉద్దేశపూర్వకంగానే ఒక ప్రణాళికాబద్ధమైన కుట్రతో ఉద్యోగాలలో ఇటువంటి నియామకాలు చేస్తున్నదని ఆరోపించారు. ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ కూడా ఎక్స్ పోస్ట్‌లో ఈ చర్యను రాజ్యాంగంపై "డర్టీ జోక్" అని అభివర్ణించారు. 2021లో, నేషనల్ కమీషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎన్‌సిబిసి) కూడా లేటరల్ ఎంట్రీలలో రిజర్వేషన్లు లేకపోవటం గురించి అంతర్గతంగా ప్రశ్నలను లేవనెత్తింది. రిజర్వేషన్ లేకపోవటం ఒక్కటే సమస్య కాదని ప్రభుత్వంలో పనిచేస్తున్న ఐఎఎస్ అధికారి ఒకరు తెలిపారు. "ఐఎఎస్ అధికారుల కొరతను భర్తీ చేయటానికి.. ఇది పనికిరాని ప్రణాళిక. ప్రభుత్వంలో వెయ్యి మందికి పైగా ఐఎఎస్ అధికారుల కొరత ఉన్నది. 2023 ప్రభుత్వ డేటా ప్రకారం.. 1,469 మంది అధికారుల సంఖ్యకు గానూ 442 మంది ఐఎఎస్ అధికారులు మాత్రమే కేంద్రంలో పని చేస్తున్నారు. ఈ ఖాళీలను యుపిఎస్‌సి ద్వారానే భర్తీ చేయడం సరైనదని ఆయన అభిప్రాయపడ్డారు.

కీలకస్థానాల్లో ఆర్‌ఎస్‌ఎస్ మనుషులను చొప్పించే యత్నమే ఇది: సీతారాం ఏచూరి

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కేందుకు, రిజర్వేషన్లను తిరస్కరించేందుకే. మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి ఈ లేటరల్ ఎంట్రీని ఎంచుకుందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. అదే యుపిఎస్‌సి సాధారణ ఎంపిక ద్వారా చేస్తే, 45 మందిలో కనీసం 23 మంది సమర్థులైన ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి మిగతా 2లో

నేడు తిరుపతి, నెల్లూరులో సిఎం పర్యటన

- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో సోమవారం పర్యటించనున్నారు. తిరుపతి జిల్లాలో శ్రీసిటీలోని పలు ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు పలు సంస్థలకు శంకుస్థాపనలు చేస్తారు. వీటిల్లో 15 సంస్థల కార్యకలాపాల ప్రారంభంతోపాటు, మరో 7 సంస్థల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. నాలుగు ప్రముఖ కంపెనీలతో రూ.1,213 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు ప్రభుత్వం కుదుర్చుకోనుంది. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సిఇఒలతో భేటీ కానున్నారు. శ్రీసిటీ పర్యటన అనంతరం నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తారు.

నేడు శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన నవంబరు నెల కోటాను ఆగస్టు 19న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఆగస్టు 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని ఆలయ అధికారులు తెలిపారు. ఈ టికెట్లు పొందిన వారు ఆగస్టు 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయన్నారు. నవంబరు 9న శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పుష్పయాగం సేవ టికెట్లను ఆగస్టు 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారని పేర్కొన్నారు. 23న అంగప్రదక్షిణ టోకెన్ల కోటా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలంలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రేమిడిచర్ల గ్రామానికి చెందిన మోటపోతుల వెంకటేశ్వర్లు (65) తనకున్న నాలుగు ఎకరాల పొలంతోపాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేస్తున్నారు. పంట సాగు నిమిత్తం అందినచోట అప్పులు చేశారు. గత మూడేళ్లుగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో అప్పులు మరింత పెరిగాయి. ఈ ఏడాది తొమ్మిది ఎకరాల్లో ఎకరా రూ.లక్ష పెట్టుబడితో మిర్చి సాగు చేసి పంటను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశారు. అయినా, సరైన ధరలు దక్కలేదు. పంట అమ్మిన డబ్బుతో కొంత అప్పు తీర్చినా ఇంకా రూ.15 లక్షలకుపైగా ఉండడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ.బాలకష్ణ కేసు నమోదు చేశారు.

నిందితులకు శిక్ష పడేలా చర్యలు

- ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరులో మహిళలపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితులకు శిక్షలు పడేలా చర్యలు చేపడుతున్నామని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ తెలిపారు. నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఘటనకు పాల్పడిన పవన్, నాగేంద్రబాబు, విజయకుమార్‌లు చిత్తు కాగితాలు, వ్యర్థ పదార్థాలు ఏరుకుని వాటిని అమ్ముకుని జీవనం సాగించేవారని, వీరిని గంటల వ్యవధిలో ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ సమావేశంలో ఒకటో పట్టణ సిఐ రాజశేఖర్, ఎస్ఐలు లక్ష్మణ్ బాబు, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలి

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ ద్వారా సిఎం చంద్రబాబుకు ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రూప్-2 డిప్యూటీ పోస్టుల ఎంపికలో అనుసరించిన 1:100 నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రూప్-1, 2 పరీక్షలకు మధ్య సమయం తక్కువగా ఉండటం, కేవలం మూడు వారాల వ్యత్యాసంలోనే రెండు పరీక్షలు జరగడం, కొత్త సిలబస్ అని చెప్పి పాత సిలబస్‌లోనే ప్రిలిమ్స్ పరీక్షలు పెట్టడంతో అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని పేర్కొన్నారు. అభ్యర్థుల జీవితాలకు సంబంధించిన అంశం కాబట్టి ఈ విషయంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

పోలవరం ఫైల్స్ దగ్ధంపై కఠిన చర్యలు

- మంత్రి కందుల దుర్గేష్

కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఫైల్స్ తగలబెట్టిన ఘటనను తీవ్రంగా పరిగణిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన పోలవరం ఎడమ కాలువ భూసేకరణ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సందర్శించారు. సంఘటనపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనం ఉండేలా ప్రజలకు పరిపాలన అందించాలనే సంకల్పంతో ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చే రీతిలో కొందరు అధికారులు, ఉద్యోగులు ప్రవర్తించడం, సంఘటనలు జరగడం వంటి వాటి విషయాల్లో ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వాస్తవాలను వెలికితీసేందుకు ఈ ఘటనపై విచారణ చేపట్టాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. ఫైల్స్ డిస్పోజ్ చేసే క్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాల్సిన వాటి విషయంలో సంబంధిత సిబ్బంది అలసత్వాన్ని ఉపేక్షించబోమని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు మాట్లాడుతూ పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్టు ఫైల్స్ దగ్ధంపై సమగ్ర విచారణ చేపట్టి దోషులని తేలితే సస్పెండ్ చేస్తామని, క్రిమినల్ కేసులు నమోదుకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ కెఎల్.శివజ్యోతి, డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి, రూరల్ తహశీల్దార్ జె.లక్ష్మీ రమ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి విస్తృత పోరాటాలు

సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి- నెల్లూరు

కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేయాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. నెల్లూరులో మూడు రోజుల జరిగిన ఈ సమావేశం ఆదివారం ముగిసింది. ఇటీవల కోల్‌కత్తాలో జరిగిన సిఐటియు ఆలిండియా కౌన్సిల్ సమావేశ సూచనలకు, 17వ మహాసభలో తీసుకున్న కర్తవ్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని, రాష్ట్రంలో సిఐటియు నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని, నూతన ఒరవడితో పనిచేయాలని నిర్దేశించుకున్నారు. రాష్ట్రంలో మరింత బలమైన కార్మిక సంఘంగా సిఐటియు విస్తరించడానికి అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాల వల్ల ఎంతటి ప్రమాదం పొంచి ఉందో కార్మిక వర్గానికి, ప్రజలకు వివరించాలని సూచించారు. కార్మికుల హక్కులను హరించే విధంగా రూపొందించిన లేబర్ కోడ్‌లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటిగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిందన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశ ప్రజల మధ్య అనైక్యతను సృష్టించాలని చూస్తోందని విమర్శించారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి తగినంత మెజార్టీ లేకపోయినా ఫెడరల్ వ్యవస్థపైనా, సెక్యులర్ వ్యవస్థలపైనా దాడులకు కొనసాగిస్తోందని తెలిపారు. వీటన్నింటిపైనా కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలో నిర్వహించాల్సిన భవిష్యత్తు కార్యక్రమాలను వివరించారు. ముగింపు సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సిఐటియు నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు.

రేపు 'నామినేటెడ్' తొలిదశ విడుదల?

- టిటిడి ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో నామినేటెడ్ పోస్టుల తొలిదశ జాబితా మంగళవారం విడుదల కానున్నట్లు సమాచారం. సాధారణ పరిపాలనశాఖ కొంతమంది పేర్లను ఖరారు చేసినట్లు తెలిసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు, డిజిటల్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా జివి రెడ్డి పేర్లు ఖరారైనట్లు సమాచారం. వైసిపి లానే ఎస్‌సి కార్పొరేషన్‌కు ఇద్దరు ఛైర్మన్లుగా ప్రభుత్వం నియమించనుంది. మాల కార్పొరేషన్ ఛైర్మన్‌గా కావలి ప్రతిభా భారతి కుతూరు కావలి గ్రీష్మను, ఎన్‌టిఆర్ జిల్లా ఎం కొండూరుకు చెందిన వాసం మునియ్యకు మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ పేర్లు ఖరారైనట్లు తెలిసింది. వీరితోపాటు మరికొందరి పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం. అయితే ఎవరికి ఏ పదవులు వరించనున్నాయో అనే సమాచారం ఎవరికీ తెలియడం లేదు. చివరకు పదవులు అందుకునే వారికి కూడా తెలియడం లేదు. దీంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. సోమవారం సుమారు 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల కానున్నాయి. వీటిల్లో ఆర్‌టిసి కార్పొరేషన్ ఛైర్మన్, పౌరసరఫరాల కార్పొరేషన్, ఎస్‌సి కమిషన్ ఛైర్మన్లు ఈ జాబితాలో విడుదల కానున్నాయని సమాచారం.

మహిళలకు రక్షణ కరువు

- ఏలూరు ఘటనలో పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలకు ఏమాత్రం రక్షణ లేని ఆందోళనకర పరిస్థితుల్లో జనం బతకాల్సి రావడం తీవ్ర ఆందోళన కల్గిస్తుందని ఐద్వా రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఏలూరులో శుక్రవారం రాత్రి జరిగిన సామూహిక అత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆ సంఘం కార్యదర్శి డి రమాదేవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి లేక పొట్టకూటి కోసం ఏలూరు వచ్చి రోజువారీ పనులు చేసుకుంటున్న మహిళపై అత్యాచారం చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనను చూసిన యువకుడు 100 నెంబర్‌కు ఫోన్ చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి తెలియజేశారన్నారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్యంపై ఆ శాఖ స్పందించాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న లైంగిక అత్యాచార కేసులను ఇంతవరకు ఫాస్ట్‌ట్రాక్ విచారణకు ఆదేశించలేదని పేర్కొన్నారు. దారుణంగా జరిగిన కేసులను రోజువారీ విచారణ చేసి కఠిన శిక్షలు విధించాలన్నారు. మద్యం, మత్తు మందుల కారణంగా జరుగుతున్న ఈ అక్రమాలను అరికట్టేందుకు తక్షణం మద్యం అక్రమ అమ్మకాలను ఆపేందుకు ప్రభుత్వం పూనుకోవాలని డిమాండ్ చేశారు. రక్షణ కల్పించేందుకు, నిందితులపై తక్షణ చర్యలు మాటల్లో కాకుండా చేతల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం బాధితురాలి కుటుంబానికి తక్షణమే రూ.10 లక్షల సాయం అందించి, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు రక్షణ కల్పించేందుకు అన్ని చర్యలూ చేపట్టాలని కోరారు.

మోడీ విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- ప్రతిపక్ష ప్రభుత్వాలపై కక్ష సాధింపు
- నిత్యావసరాల ధరల పెరుగుదలపై ఒకటి నుండి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అనుకూల రాష్ట్రాలను ఒకలా.. వ్యతిరేక రాష్ట్రాలను మరోలా చూస్తూ శీతకన్ను వేయడం తగదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. కర్నూలు జిల్లాలోని ఓ హోటల్లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రజా స్వామ్యయుతంగా ప్రజలచే ఎన్నుకున్న ముఖ్యమంత్రి సిద్ద రామయ్యపై రాష్ట్ర గవర్నర్ విచారణకు ఆదేశించడం ప్రజలను అవమానపరచడమేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణికి సంబంధించిన భూమి మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అభివృద్ధి అవసరాలకు వినియోగించినందుకు ప్రతిఫలంగా మరో ప్రాంతంలో భూములు ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. సిఎంపై ఇచ్చిన ఆదేశాలు ఉపసంహరించుకొని.. ఆరాష్ట్ర గవర్నరును తక్షణమే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కేరళ, పంజాబ్ రాష్ట్రాల పట్ల కూడా కేంద్రం కక్ష సాధింపుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జార్ఖండ్, ఢిల్లీ సిఎంలు కేంద్ర విధానాలు విభేదిస్తున్న కారణంగానే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని అబాసుపాలు చేసిందన్నారు. సిఎం చంద్రబాబు ధోరణి రాష్ట్ర ప్రత్యేక హోదా అవసరం లేదన్నట్లు ఉందని నిత్యావసరాల ధరల పెరుగుదల పై సెప్టెంబరు 1 నుండి 7వ తేదీ వరకు దేశవ్యాప్తం గా ఆందోళనలు చేపట్టనున్నట్లు నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాధం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, సిపిఐ నగర అధ్యక్షులు పి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్టేడియంలో పరిశీలిస్తున్న శివనాథ్

ఇంటర్నేషనల్‌గా స్టేడియంగా తీర్చిదిద్దుతాం

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

మంగళగిరి క్రికెట్ స్టేడియాన్ని ఇంటర్నేషనల్‌గా స్టేడియంగా తీర్చిదిద్దు తామని విజయవాడ ఎంపి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్మితమవుతున్న క్రికెట్ స్టేడియాన్ని ఆయన ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి జిల్లాల్లోనూ స్టేడియాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మంగళగిరి స్టేడియంలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వంతో చర్చిస్తామని చెప్పారు ఏడాదిలోగా ఈ స్టేడియం పనులను పూర్తి చేసి వచ్చే ఏడాది అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరిగేలా చూస్తామన్నారు. మంగళగిరిలో రైల్వే ట్రాక్ వద్ద ఆర్‌ఒబి నిర్మాణం, ప్రధాన రహదారికి అనుసంధానంగా మరో రోడ్డును నిర్మించాల్సి ఉందన్నారు. మంగళగిరి ప్రాంతం రాజధానిలో ఉన్న నేపథ్యంలో ఈ స్టేడియానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

ప్రైవేటు వారికి ఐఎఎస్‌లు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులు ఉంటారు. మనుస్మృతి సామాజిక ఆదేశాన్ని అమలు చేయటానికే మోడీ ఇటువంటి తక్షణ చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఇప్పటికే ఉన్న ఉద్యోగుల అవకాశాలను సైతం దెబ్బతీస్తుందని ఆయన హెచ్చరించారు.

యువత హక్కులను దోచుకోవడం, రిజర్వేషన్లను అంతం చేయడమే 'మోడీ హామీ': రాహుల్ గాంధీ

"ఐఎఎస్ వ్యవస్థను ప్రయివేటీకరించడం, రిజర్వేషన్లను అంతం చేయడమే 'మోడీ హామీ'. ప్రభుత్వ ఉద్యోగులను లేటరల్ ఎంట్రీ ద్వారా రిక్రూట్ చేసుకునేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్య "దేశ వ్యతిరేకమైనది". ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల రిజర్వేషన్లను బాహాటంగా లాక్కుంటున్నారు. యుపిఎస్‌సికి బదులుగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తూ ప్రధాని నరేంద్రమోడీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. బ్యూరోక్రసీతో సహా దేశంలోని అన్ని అత్యున్నత పదవుల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం ఉండటం లేదు. దాన్ని మెరుగుపరచకపోగా, లేటరల్ ఎంట్రీ పేరుతో ఉన్నత పదవులకు ఆయా వర్గాలను దూరం చేస్తున్నారు. నిర్ణయాత్మక ప్రభుత్వ పదవుల్లో కూర్చోవడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏమి చేస్తారనే దానికి సెబీ ఒక స్పష్టమైన ఉదాహరణ. ప్రయివేట్ రంగానికి చెందిన వ్యక్తి మాధబి బుచ్‌ని సెబి ఛైర్‌పర్సన్‌గా నియమిస్తే ఏం జరుగుతుందో చూస్తూనే ఉన్నాం.

దొడ్డి దారి నియామకాలు : ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్

బ్యాక్‌డోర్ ద్వారా తన సైద్ధాంతిక మిత్రులను ఉన్నత పదవులకు నియమించేందుకు బిజెపి పన్నిన కుట్ర ఇది అని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ విమర్శించారు. దీనిని కచ్చితంగా వ్యతిరేకించాలి. ఈ తిరోగమన చర్యను వెనక్కి కొట్టేందుకు దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాల్సిన అవసరముంది. ఈ పద్ధతితో సామాన్య ప్రజలు కేవలం క్లర్కులు, ప్యూన్లకే పరిమితమవుతారు. వాస్తవానికి ఇది వెనుబడిన, దళిత, మైనారిటీ వర్గాల రిజర్వేషన్, వారి హక్కులను లాక్కోవడమేనని సమాజ్‌వాది పార్టీ నేత అన్నారు.

రాజ్యాంగం, రిజర్వేషన్లతో చెలగాటం : తేజస్వి యాదవ్

మోడీ ప్రభుత్వం రాజ్యాంగం, రిజర్వేషన్లతో చెలగాటమాడుతోందని ఆర్జేడి నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం రిజర్వేషన్లను అంతమొందించాలని చూస్తోందని అన్నారు. రిజర్వేషన్లను అంతమొందించడం, రాజ్యాంగాన్ని రద్దు చేయడమే మోడీ ఏకైక కార్యక్రమంగా పెట్టుకున్నారని ఆప్ సీనియర్ ఎంపి సంజయ్ సింగ్ విమర్శించారు. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల వారీ హక్కులను తుంగలో తొక్కేందుకు బిజెపి ఈ లేటరల్ ఎంట్రీ పద్ధతిని తీసుకొచ్చిందన్నారు.

విద్యారంగ సమస్యలపై చర్చించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని ఎస్‌టియు ఆదివారం కోరింది. విజయవాడలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎల్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సిబిఎస్ఇ పరీక్ష విధానం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర పరీక్ష విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిఓ 117 రద్దుపై విధాన ప్రకటన చేయాలని, ఉపాధ్యాయుల పనిభారం, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. తెలుగు మాధ్యమం కొనసాగింపు, పదో తరగతి విద్యార్థులకు ఈ మాధ్యమంలో పరీక్షల నిర్వహణ అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, జల్లి విల్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రోత్సహించే నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు విద్యారంగానికి కేటాయింపులు ఉండాలన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపులపై నిర్ణయం తీసుకోవాలని, చెల్లింపుల షెడ్యూల్ ప్రకటించాలని సంఘం ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కోరారు. 12వ పిఆర్‌సి అమలు ఆలస్యం అవుతున్నందున వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకులు జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1284వ రోజుకు చేరాయి. దీక్షల్లో విశాఖ ఉక్కు శ్రామిక సంఘం (టిఎన్‌టియుసి) కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు, కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉక్కు కర్మాగారం పట్ల అవలంబిస్తున్న వైఖరిని ఖండించారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు బొడ్డు పైడిరాజు, పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, ఎం రాజశేఖర్, ఎన్.రామారావు, ఎల్లేటి శ్రీను, నీరుకొండ రామచంద్రరావు, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఎమ్‌డి ఇర్ఫాన్, వైసిపి నాయకులు కోమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిడిపి నేత హత్య కేసులో నిందితుల అరెస్టు

- బైకు, కత్తి, ఇనుప రాడ్డు స్వాధీనం

ప్రజాశక్తి-పత్తికొండ (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో టిడిపి నేత హత్య కేసులో ఇద్దరు మైనర్లతోసహా ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పత్తికొండ ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి శ్రీనివాస్‌చారి తెలిపారు. హత్య కేసు వివరాలను పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం మీడియాకు వెల్లడించారు. డిఎస్‌పి శ్రీనివాస్‌చారి తెలిపిన వివరాల ప్రకారం.. హోసూరు గ్రామంలో టిడిపి నేత వాకిటి శ్రీనివాసులకు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అదే గ్రామానికి చెందిన ఆయన ప్రత్యర్థులు మాజీ బిఎస్ఎఫ్ సర్వీస్ మెన్ గుడిసె నరసింహులు, అతని అనుచరులు బోయ రామాంజనేయులు, ఉలివెని హరికృష్ణ కలిసి గ్రామంలో ఆధిపత్యం కోసం శ్రీనివాసులును హతమార్చాలని నిర్ణయించుకున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన వడ్డే నరసింహులును సంప్రదించి రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.50 వేలు తీసుకున్నారు. ఈ నెల 14న శ్రీనివాసులు బహిర్భూమికి వెళ్లిన సమయంలో కళ్లలో కారం చల్లి, రాడ్లతో కొట్టి హత్య చేశారు. విచారణ అనంతరం గుడిసె నరసింహులు, బోయ రామాంజనేయులు, ఉలివేణి హరికృష్ణ, వడ్డే నరసింహులతోపాటు హత్యలో పాల్గొన్న ఇద్దరు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మోటార్ బైక్, ఐరన్ రాడ్డు, ఓ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పత్తికొండ అర్బన్ సిఐ జయన్న, పత్తికొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, దేవనకొండ సిఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ వేముల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములపై ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

కట్టబెట్టిన విషయం వెలుగులోకి వస్తే క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడం కష్టమవుతుందనే భావన ఒక వైపు, ప్రభుత్వ పరంగా కేసులు నమోదుతో పాటు సస్పెన్షన్లు తప్పవనే ఆందోళన మరోవైపు ఉద్యోగుల్లో కనబడుతోంది.

26 జిల్లాల్లో ఫ్రీ హోల్డ్ చేసిన భూముల వివరాలు

జిల్లా పేరు	మొత్తం అసైన్డ్ ల్యాండ్స్ (ఎకరాలు)	నిషేధిత జాబితా నుంచి తొలగించింది
శ్రీసత్యసాయి	4,93,274	2,57,042(ఎకరాలు)
ప్రకాశం	4,00,252	1,86,286
అన్నమయ్య	3,31,516	1,62,442
చిత్తూరు	3,64,242	1,60,677
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు	2,94,536	1,10,932
తిరుపతి	2,31,314	79,169
వైఎస్ఆర్	1,74,895	76,321
నంద్యాల	1,35,607	65,380
అనంతపురం	3,55,970	40,800
కర్నూలు	1,77,648	37,299
పల్నాడు	45,234	31,897
అల్లూరి సీతారామరాజు	1,05,533	22,906
కృష్ణా	35,503	19,191
పార్వతీపురం మన్యం	89,841	17,680
ఏలూరు	75,467	17,230
బాపట్ల	44,993	13,839
అనకాపల్లి	77,012	12,812
శ్రీకాకుళం	47,848	8,644
ఎన్‌టిఆర్	17,046	8,482
విజయనగరం	50,385	8,090
కాకినాడ	21,890	7,015
డాక్టర్ బిఆర్ అంబేద్కర్	17,198	5,243
తూర్పుగోదావరి	5,258	5,021
పశ్చిమ గోదావరి	23,774	2,516
గుంటూరు	9,412	1,624
విశాఖపట్టణం	11,100	1,267
మొత్తం :	**36,36,749**	**13,59,806 ఎకరాలు**

ఆందోళనలు ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

నివేదికను ఎంహెచ్ఎ కంట్రోల్ రూమ్ (న్యూఢిల్లీ)కి ఆదివారం మధ్యాహ్నం నుండి ఫ్యాక్స్/ఇమెయిల్/వాట్సప్‌ద్వారా పంపాలని హోం శాఖ పోలీసు శాఖలకు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది.

మమతాపై విశ్వాసం కోల్పోయాం: మృతురాలి తల్లిదండ్రులు

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విశ్వాసం కోల్పోయామని మృతురాలి తల్లిదండ్రులు తెలిపారు. ఈ సంఘటనలో చాలా మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం మీడియాతో మృతురాలి తండ్రి మాట్లాడుతూ ఇంతకు ముందు బెంగాల్ ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం ఉండేదని కానీ ఇప్పుడు లేదన్నారు. న్యాయం జరగాలని మమతా చెబుతోంది.. కానీ దాని కోసం ఆమె ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తన కుమార్తె డైరీలోని ఒక పేజీని సిబిఐకి అందజేసినట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాధితురాలి తల్లి మాట్లాడుతూ 'మీ కూతురికి ఆరోగ్యం బాగలేదని శుక్రవారం ఉదయం 10:53 గంటలకు ఆసుపత్రి వాళ్లు ఫోన్ చేసి కాల్ కట్ చేశారు. తర్వాత ఫోన్ చేసి ఏం జరిగిందో చెప్పండి అని ప్రశ్నిస్తే.. ఆసుపత్రికి రమ్మన్నారు. మీ కూతురు ఆత్మహత్య చేసుకుందని అక్కడున్న ఓ అసిస్టెంట్ మాతో చెప్పింది. విషయం తెలిసిన వెంటనే మేము అక్కడకు వెళ్లాం. మమ్మల్ని హాలులోకి వెళ్లేందుకు అనుమతించలేదు. తీరా మధ్యాహ్నం 3గంటలకు లోనికి పంపారు. నా కుమార్తెను చూసి కుంగిపోయా. కేవలం ఒక్క చిన్న వస్త్రం మాత్రమే తన శరీరంపై ఉంది. చేతులు విరిగిపోయాయి. కళ్లు, నోటి నుంచి రక్తం వస్తోంది. నా కూతురిని చూడగానే ఎవరో హత్య చేసినట్లు అనిపించింది. నా కుమార్తె ఆత్మహత్య చేసుకోలేదు ఎవరో చంపేశారు అని అక్కడున్న వారితో అప్పుడే చెప్పా. నా కూతురును డాక్టర్‌ను చేయడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం. చివరకి ఆమెను ఇలా హత్య చేశారు' అని చెప్పారు.

ముంబయిలో మహిళా డాక్టర్‌పై దాడిఇద్దరి అరెస్టు

ముంబయిలో సియోన్ ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున మహిళా డాక్టర్‌పై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. క్యాజువాలిటీ వార్డులో ఒక రోగి చెవిలో రక్తాన్ని మహిళా డాక్టర్ శుభ్రం చేస్తుండగా ఈ దాడి జరిగింది. రోగితో పాటు వచ్చిన ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి డాక్టర్‌పై దాడి చేయడంతో ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన గురించి సియోన్ ఆసుపత్రి ఒక ప్రకటనలో వివరించింది. ఈ దాడిని ఆందోళనకరంగా పేర్కొంటూ, అన్ని ఆసుపత్రుల్లో కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ దాడి మరోసారి వెల్లడిస్తుందని తెలిపింది.

అధ్యక్షులు చక్రపాణి

ఉపాధ్యక్షులు లీలావతి

ఎపి స్టేట్ జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఎపి స్టేట్ జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. గుంటూరులో ఆదివారం జరిగిన అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఎన్నికకు రిటైర్డ్ జడ్జి విరూపాక్ష దత్తాత్రేయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మొత్తం 521 ఓట్లు పోల్ అయ్యాయి. ప్రెసిడెంట్‌గా జి.చక్రపాణి, వైస్ ప్రెసిడెంట్స్‌గా టి.లీలావతి, కె.శైలజ, జె.శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కమ్ ట్రెజరర్‌గా నంబళ్ల రమేష్ నాయుడు, జాయింట్ సెక్రెటరీలుగా ఎం.ప్రదీప్‌కుమార్, జి.కార్తీక్, ఎ.కృష్ణప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.లీలా వెంకటశేషాద్రి, ఎస్.పి.డి.వెన్నెల, బి.రాధారాణి, డాక్టర్ సిహెచ్.శ్రీనివాసబాబు ఎన్నికయ్యారు.

గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్‌గా రాష్ట్రానికి అవార్డు

- మంత్రి గొట్టిపాటి హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్‌గా ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ రాష్ట్రాన్ని గుర్తించి అవార్డు ప్రకటించింది. 2023-24 ఏడాదికి గానూ ఈ అవార్డును అందించింది. తమిళనాడులోని కోయంబత్తూరు వేదికగా జరిగిన ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ సమావేశంలో ఎపి ఈ అవార్డు సొంతం చేసుకుంది. పవన విద్యుత్ జాయింట్ సెక్రటరీ లలిత్ బోరా చేతుల మీదుగా ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎమ్‌డి అండ్ సిఇఒ ఎం కమలాకర్ బాబు ఆదివారం అందుకున్నారు. 2014-19 కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునరుత్పాదక విద్యుత్‌కు ఇచ్చిన ప్రాధాన్యత వల్లే రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్‌గా నిలబెట్టిందని కమలాకర్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే పునరుత్పాదక విద్యుత్‌కు రాష్ట్రం పెద్దపీట వేస్తోందని వెల్లడించారు. ఈ అవార్డు రావడం పట్ల విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్‌కు ఎపి పెద్దపీట వేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

- ఎస్‌టిటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అంబేద్కర్ (సాంఘిక సంక్షేమ) గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మూడు నెలలు నుంచి జీతాలు చెల్లించడం లేదని షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టిటిఎఫ్) తెలిపింది. జీతాలు లేకపోవడంతో ఆర్థికంగా ఉపాధ్యాయులు అల్లాడుతున్నారని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోర్ల సుధాకర్, కాళింగిరి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలకోసారి జీతాలు చెల్లించే విధానం కాకుండా ప్రతినెలా ఒకటో తేదీన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసినట్లే గురుకులాలను కూడా చేయాలన్నారు. 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు.

రాళ్లఅనంతపురంలో భూపోరాటం

- అడ్డుకునేందుకు పెత్తందారుల యత్నం
- సిపిఎం నాయకులపై దౌర్జన్యం

సిపిఎం, సిఐటియు జెండాలతో భూ స్వాధీన పోరాటంలో పాల్గొన్న పేదలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ (శ్రీసత్యసాయి జిల్లా)

శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం రాళ్లనంతపురం గ్రామంలో పేదలు భూస్వాధీన పోరాటం నిర్వహించారు. జెకె.పల్లిలోని రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 51లోని 19.12 ఎకరాల్లో ఎర్రజెండాలను పాతారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలను ఆ భూముల నుంచి వెళ్లగొట్టాలన్న ఉద్దేశంతో రాళ్లఅనంతపురం గ్రామానికి చెందిన పెత్తందారులు యోగానంద రెడ్డి, నాగిరెడ్డి తదితరులు వారి అనుచరులతో అక్కడికి చేరుకున్నారు. సర్వే నెంబర్ 51 భూమికి సంబంధించి ఇది వరకే అధికారులు పట్టాలు ఇచ్చారని, స్థలం నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ బెదిరింపులకు దిగారు.

పట్టాలిచ్చి ఉంటే చూపించాలని సిపిఎం నాయకులు నిలదీశారు. దీంతో వారు కొన్ని పట్టాలను చూపించగా అవి నకిలీవిగా గుర్తించారు. పట్టాలను తహశీల్దార్ కార్యాలయానికి తీసుకువస్తే అధికారులే అవి నకిలీవా? కాదా? అన్న విషయాలను నిర్ధారిస్తారని సిపిఎం నాయకులు తెలిపారు. ఇందుకు పెత్తందారులు వినకుండా సిపిఎం నాయకులపై దౌర్జన్యానికి దిగారు. ఈ క్రమంలో ఘర్షణ పెద్దదికాకుండా ఈ సమస్యను సోమవారం తహశీల్దార్ కార్యాలయంలోనే తేల్చుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సిపిఎం ముదిగుబ్బ మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ.. జెకె.పల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరుతుంటే కొందరు పెత్తందారులు తమపై దాడి చేస్తున్నారని తెలిపారు. పెత్తందారులు నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని కాజేయాలని చూస్తున్నారని తెలిపారు. వారి వద్ద ఉన్న పత్రాలను తహశీల్దార్ కార్యాలయ అధికారులు పరిశీలించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తాము న్యాయబద్ధంగా కోరుతుంటే గ్రామానికి చెందిన యోగానంద రెడ్డి, నాగిరెడ్డి, వారి అనుచరులు గంగాధర, ధనుంజయరెడ్డి, తిరుపాల్, మోహన తదితరులు మూకుమ్మడిగా తమపై దాడి చేశారన్నారు. పేదలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

నాన్ ప్రయారిటీ సెక్టార్లో ఎన్‌పిఎగా రూ.6,358 కోట్లు

- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే రూ.3,752 కోట్లు
- యూనియన్ బ్యాంకు రుణాలు రూ.1,687.99 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బ్యాంకింగ్ రంగంలో నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పిఎ) పెరిగిపోతున్నాయి. నాన్ ప్రయారిటీ రంగంలో బకాయిల సంఖ్య వందల కోట్ల నుండి వేల కోట్లలోకి చేరింది. వీటిపై బ్యాంకర్లు పెద్దయెత్తున ఆందోళన చెందుతున్నారు. రుణాలు తీసుకున్న సంస్థలు తిరిగి చెల్లింపులు చేయకపోవడంతో సమస్య జటిలమవుతోందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఎన్‌పిఎల సంఖ్య ఎక్కువగా ఉంటోందని, రుణాలు తీసుకున్న సంస్థలు తిరిగి చెల్లింపులు చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వాటిని వసూలు చేయడం తలకుమించి పనిగా మారుతోందని ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే రుణాల్లోనూ తమ సెక్టార్ నుండే ఎక్కువ రుణాలు ఇస్తున్నామని, కమర్షియల్ బ్యాంకుల నుండి ఇచ్చే రుణాలు తక్కువగా ఉంటున్నాయని, దీంతో ఎన్‌పిఎల సంఖ్య ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఎక్కువగా ఉంటోందని బ్యాంకు అధికారుల సంఘం నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 33 బ్యాంకులు, ఒక కో-ఆపరేటివ్ బ్యాంకు, నాలుగు ఆర్‌ఆర్‌బిలు, మూడు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో 71,66,390 ఖాతాలు ఉండగా, వాటికి గానూ 3,46,550.93 కోట్లు రుణాలిచ్చారు. అలాగే 2,47,648 ఖాతాలకు సంబంధించి రూ.6,358.96 కోట్లు ఈ ఏడాది మార్చి 31 నాటికి ఎన్‌పిలుగా మారాయి. వీటిల్లో ముఖ్యంగా యూనియన్ బ్యాంకుకు సంబంధించిన 29,490 ఎన్‌పిఎ ఖాతాలకు రూ.1,687.99 కోట్లు ఉన్నాయి. మొత్తంగా ఈ బ్యాంకు 2024 మార్చి 31 నాటికి 4,26,544 ఖాతాలకు రూ.41,500 కోట్ల రుణాలిచ్చింది. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.1,11,407 కోట్లు ఇవ్వగా, ఈ బ్యాంకుకు సంబంధించిన ఎన్‌పిఎగా మారిన రుణాలు రూ.475.79 కోట్లున్నాయి. అలాగే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు సంబంధించి రూ.662.68 కోట్లు ఎన్‌పిఎలుగా మారాయి. ఎపి కో-ఆపరేటివ్ బ్యాంకు రూ.8,102 కోట్ల రుణాలిస్తే.. రూ.424 కోట్ల బకాయి ఉంది. ఎపిజిబి, ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు, సిజిజిబి, సప్తగిరి గ్రామీణ బ్యాంకులకు సంబంధించి మొత్తం రూ.91.76 కోట్ల రుణ బకాయిలు ఉన్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఈక్విటీస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లిమిటెడ్ రూ.12 కోట్లు, పిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు రూ.5 కోట్లు బకాయిలున్నాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఎక్కువ రుణాలు

రాష్ట్రంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు 13, ప్రైవేటు రంగ బ్యాంకులు 21 ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 28,09,024 ఖాతాలు ఉండగా, రూ.2,32,558.05 కోట్ల రుణాలిచ్చాయి. వాటిల్లో రూ.3,752.47 కోట్లు బకాయిలున్నాయి. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో 38,61,568 ఖాతాలుంటే రూ.99,820.87 కోట్ల రుణాలిచ్చాయి. ఈ బ్యాంకుల్లో రూ.2,072 కోట్లు బకాయిలున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలన్నా తక్కువ మొత్తం తీసుకుంటాయి.

ప్రైవేటురంగ బ్యాంకులో ఖాతాలు తెరవాలంటే రూ.1100 నుండి రూ.5000 వరకూ కనీస మొత్తాన్ని వసూలు చేస్తాయి. ఆ రూపంలోనే వాటి దగ్గర ఎక్కువ డిపాజిట్లు జమవుతున్నాయి. కానీ రుణాలు ఇచ్చే విషయంలో మాత్రం ఆసక్తి చూపించడం లేదని ఇటీవల ప్రభుత్వం వెల్లడించిన ఓ నివేదికలో బయటపడింది.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి - నంద్యాల

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి రాష్ట్రప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో సాంస్కృతిక రంగం - ఉపాధ్యాయుల పాత్ర అంశంపై సదస్సు నంద్యాల నేషనల్ పీజీ కళాశాలలో జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో ప్రవేశపెట్టిన ఏకపక్ష సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీన పడిందని విమర్శించారు. విద్యా సంస్కరణలలో భాగంగా తెచ్చిన సర్క్యులర్ 172, జిఒ 117లో ఇంగ్లీషు మీడియం మాత్రమే ప్రవేశపెట్టిన పరిణామాల వల్ల 13 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. 4,600 పాఠశాలలలో ఒకటి రెండు తరగతి పిల్లలు సింగిల్ డిజిట్‌లో మాత్రమే ఉన్నారని, ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడినివిడిచి రెండు లక్షలకు పైగా విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లిపోయారని తెలిపారు. సిబిఎస్ఇ పరీక్షా విధానం, ఎన్‌సిఆర్‌టి సిలబస్ వల్ల పాఠశాలల్లో గందరగోళం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ మీడియంలలో పరీక్షా విధానం ఉండాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడి బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఒకటి నుంచి ఐదు తరగతులు ప్రాథమిక పాఠశాలలుగా ఉంచాలని సమాంతర మీడియంలను కొనసాగించాలని, రాష్ట్రమంతా ఒకే సిలబస్ అమలు చేయాలని కోరారు. జిఒ117 తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా మాట్లాడుతూ రెండేళ్ల క్రితం మున్సిపల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యా పర్యవేక్షణలోకి తెచ్చారని, దీనివల్ల మున్సిపల్ ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలు వర్తిస్తాయని తెలిపారని చెప్పారు. ఆచరణలో డిడిఒ పవర్ తప్ప బదిలీలు ప్రమోషన్లు అప్ గ్రేడేషన్, పిఎఫ్ ఖాతాలు అమలు కాలేదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరారు. గిరిజన మోడల్ స్కూల్ ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలి : యుటిఎఫ్

సదస్సు అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో పాఠశాలల విద్యావ్యవస్థ గాడితప్పిందని, గాడిలో పెట్టేందుకు ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇంకా విద్యా విధానంలో ఎలాంటి మార్పులు చేస్తున్నారో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్‌కు దాసోహమంటూ పాఠశాలల విద్యలో సాల్ట్ పథకాన్ని అమలు చేయడం వల్ల ప్రాథమిక విద్య తీవ్రంగా దెబ్బతిందని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో ప్రాంతాలవారీగా మెనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాగిజావా సమయాన్ని మార్చాలని ప్రభుత్వానికి సూచించారు. ఆగిపోయిన నాడు-నేడు పనులను పూర్తి చేయాలని, గ్రాంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రపంచ బ్యాంకు విధానాలకు అనుగుణంగా తెచ్చిన సాల్ట్ పథకం నుండి బయటకు రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.

క్రీడాభివృద్ధికి కృషి

- డివైఎఫ్ఐ చర్చాగోష్టిలో వక్తలు

చర్చాగోష్టిలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రీడాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డివైఎఫ్ఐ చర్చాగోష్టిలో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తద్వారా ప్రభుత్వాల్లో కూడా మార్పు వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయి నుంచే క్రీడల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. క్రీడలపై చర్చాగోష్టి డివైఎఫ్ఐ ఆధ్వర్యాన విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ఎపి కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, ప్రజా నాట్యమండలి కార్యదర్శి అనిల్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్ మాట్లాడుతూ.. క్రీడలకు ప్రభుత్వాలు ప్రోత్సాహకం అందించకపోవడంతో యువత డ్రగ్స్ వంటి వాటికి బానిసలుగా మారి బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్రీడలను రక్షించుకుంటూ యువతను పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. 'డ్రగ్స్ వద్దు-ఆటలు ముద్దు' అనే నినాదంతో అందరూ ముందుకు రావాలని కోరారు. ప్రాథమిక స్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేయాలని కోరారు. ప్రభుత్వాలు గ్రామీణ స్థాయి నుంచి క్రీడల కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో దేశం 71వ స్థానానికి పడిపోయిందన్నారు. ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కెపి రావు, కబడ్డీ మహిళా ఇండియా కోచ్ పద్మజ బాల, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవేంద్ర మాట్లాడుతూ.. క్రీడలు వల్ల శారీరక, మానసిక ఉల్లాసం, ఉత్సాహంతో పాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. చదువు పట్ల కూడా ఏకాగ్రత పెంచుతోందని చెప్పారు. వీటిపట్ల ప్రభుత్వాలు, ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. క్రీడాకారులకు ప్రభుత్వం కనీసం వసతి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. శాప్ కోచ్‌లను నియమించి వారికి కనీస వేతనాలివ్వాలని కోరారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పి కృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా యూత్ సర్వీస్ అధికారి శ్రీనువాసులు, బాస్కెట్ బాల్ శాప్ కోచ్ సంతోష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము తదితరులు పాల్గొన్నారు. వినేష్ ఫోగట్ వంటి క్రీడాకారులకు అండగా నిలబడాలని సమావేశం తీర్మానించింది. క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాలు నిర్మించాలని, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని, ఆట వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని కోరింది. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంచాలని డిమాండ్ చేసింది.

గ్రామస్తులతో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

మానవ మనుగడకు హాని కలిగించే మైనింగ్ వద్దు

ప్రజాశక్తి - ఆనందపురం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ కొండ ప్రాంతంలో మానవ మనుగడకు హాని కలిగించే మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని మానవ హక్కుల వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త విఎస్ కృష్ణ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా అధ్యక్షులు పి రఘు, ప్రధాన కార్యదర్శి కె అనురాధ తదితరులు ఆదివారం కొండ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కుసులవాడ కొండ మైనింగ్ కోసం ఈ నెల 28న ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్నట్లు పలు పేపర్లలో వార్తా కథనాలు వచ్చిన నేపథ్యంలో వారు కుసులవాడ, గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం, బాకురుపాలెంలను సందర్శించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందన్నారు. భూగర్భజలాలు, చెరువులకు విఘాతం తలెత్తుతుందని తెలిపారు. పంటలు దెబ్బతింటాయన్నారు. ఈ నేపథ్యంలో కుసులవాడ సర్వే నెంబరు 104లో మైనింగ్ అనుమతులు కోరుతూ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను అందరూ వ్యతిరేకించాలని కోరారు.

హంసలదీవిలో ఐదుగురు గల్లంతు

- ముగ్గురిని కాపాడిన మెరైన్ పోలీసులు
- మరో ఇద్దరిలో ఒకరు మృతి, మరొకరు గల్లంతు

మృతిచెందిన యువతి షేక్ ఫజల

గల్లంతైన యువకుడు ముషారఫ్

ప్రజాశక్తి-కోడూరు (కృష్ణాజిల్లా)

ప్రముఖ పర్యాటకం హంసలదీవి బీచ్‌లో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. బీచ్‌కు ఆదివారం పర్యటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ నేపథ్యంలో గుడివాడకు చెందిన ఓ కుటుంబం సముద్రంలో స్నానం చేస్తుండగా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు గల్లంతయ్యారు. వారిలో ముగ్గురిని మెరైన్ పోలీసులు కాపాడారు. ఇద్దరు సముద్రంలో గల్లంతు కాగా.. ఒకరి మృతదేహం ఒడ్డుకు చేరింది. దీనికి సంబంధించి మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా కోడూరు మండలం హంసలదీవి బీచ్‌కు గుడివాడకు చెందిన ఒక కుటుంబ సభ్యులు స్నానాలకు వచ్చారు. వారు సముద్రంలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతికి ఐదుగురు కొట్టుకుపోతుండగా ముగ్గురిని తోటి పర్యాటకులు, మెరైన్ పోలీసులు కలిసి కాపాడారు. వారు సముద్ర నీరు తాగేయడంతో పరిస్థితి విషమంగా ఉందని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సముద్రంలోకి కొట్టుకుపోయిన ఇద్దరిలో ఒక యువతి షేక్ ఫజల (26) మృతిచెంది ఒడ్డుకు కొట్టుకువచ్చారు. మరొక వ్యక్తి ముషారఫ్ (20) గల్లంతయ్యారు. ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కోడూరు ఎస్ఐ శిరీష, అవనిగడ్డ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యువకుమార్, అవనిగడ్డ డిఎస్‌పి మురళీధర్ సంఘటన స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించి ప్రమాదానికికారణాలు తెలుసుకున్నారు. హంసలదీవిలో పర్యాటకుల ప్రమాద ఘటన పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతు అయిన వ్యక్తి కోసం మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని, ప్రాణాలతో బయట పడిన వారికి పోలీస్, రెవెన్యూ అధికారులు సహాయక చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న రామకృష్ణ, తదితరులు

అగ్రిగోల్డ్ భూములు అన్యాక్రాంతం

- బాధితులకు న్యాయం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఉరవకొండ (అనంతపురం జిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా కూడేరు మండలంలోని అగ్రిగోల్డ్ భూములను వారు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కె రామకృష్ణ, ముప్పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ భూములు ఎక్కడికక్కడ అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లాలో మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రెండు ప్రభుత్వాలు మారినా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగలేదని విమర్శించారు. మరోమారు చంద్రబాబు సిఎం అయ్యారని, ఇప్పుడైనా వారికి న్యాయం చేయాలని కోరారు. అన్ని జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను తెలుసుకుని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 28న అమరావతిలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బత్తలపల్లి మండలంలోని నిడిమామిడి భూములను కబ్జాదారుల నుంచి ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. వారి వెంట అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట సహాయ కార్యదర్శి సిద్దేశ్వర్, తదితరులు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్
(Regd. No. AMC/KNA/DCO/2016/122)
డోర్ నెం: 54-16-3/3. ప్లాట్ నం: 48, రోడ్డు నెం. 3. లయోలా గార్డెన్స్, విజయవాడ-520 008
Ph: 0866-2452129, e-mail: housing.emp@gmail.com, www.aphousingsociety.com

Notice. No. AGM/1/2024 Date: 12.08.2024

వార్షిక సర్వ సభ్య సమావేశపు నోటీసు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ (రిజిస్టర్ నం.AMC/KNA/DCO/2016/122), విజయవాడ వారి 2023-2024 సంవత్సరపు వార్షిక సర్వ సభ్య సమావేశము ది.14.09.2024 వ తేదీ రెండవ శనివారం రోజున మధ్యాహ్నం 02.30 గం.లకు, CA Convention Centre, గుంటుపల్లి (గొల్లపూడి దాటిన తర్వాత విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి ప్రక్కన గలదు) నందు నిర్వహించుటకు నిర్ణయించబడినది. మీటింగు నోటీసు, అజెండా తో సహా సభ్యులకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించ బడ్డాయి. కావున సొసైటి సభ్యులు అందరూ తప్పని సరిగా సదరు సర్వసభ్య సమావేశము లో పాల్గొని, సమావేశాన్ని దిగ్విజయం చేయవలసినదిగా కోరడమైనది. (సొసైటి బోర్డు ఆమోదం తో జారీ చేయబడినది)

సం/-అద్దాల సుబ్బరాజు
అధ్యక్షుడు

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNIMONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 22.08.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ ముగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంపేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: GUNTUR (GNR - D.No 5-87-27, 1St Floor,Opp Kfc Restaurant, Main Rdlakshmipuram,Guntur -522007, Contact no : 7893799967) 2065537, 2046085, 2060424

(*Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.*)

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNIMONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 22.08.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ ముగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంపేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: : KHAMMAM (KHM - D No 8-3-215 , First Floorbeside Indus Ind Bank,Wyra Roakhammam, Khammam - 507001, Contact no : 9959617256) 2108219, 2057684, 2028151, 2080388, 2088633, 2088635, 2031145, 2068547, 2084169, 2091512, 2063342, 2028139, 2083339, 2101726, 2110731, 2029641, 2043262, 2068785, 2047393, 2047443, 2080247, 2087451, 2110157, 2088853, 2089066, 2082559, 2084239, 2085181, 2085185, 2088216, 2100509, 2100510.

(*Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.*)

"సాహిత్యం రాజకీయాలకు అతీతంగా ఉండాలని ఎవరైనా అంటే- వాళ్లు మోసపుచ్చేవాళ్లో, మోసపోయినవాళ్లో అయి వుండాలి."

– కొడవటిగంటి కుటుంబరావు

వాళ్ళు మనుషులేనా?

వాళ్ళు మనుషుల రూపంలో
తిరుగుతున్న మృగరాక్షసులు
వాళ్లకి అమ్మ ఉంటే తెలిసేది
అమ్మతనం అంటే ఏమిటో ..!
సాటి మానవిపై ఎందుకిలా
మరణవాంగ్మూలాలు రాస్తున్నారు?

నీవు మరో 'నిర్భయ' కావు అంటూ
ఎన్ని చట్టాలు చేసినా మార్పు లేదు
తన పర బేధాలు లేని చట్టం రావాలి
మృగంగా మారే మనోవైకల్యాలకు
గుండెల్లో భయం పుట్టాలి!

అందరినీ కాపాడే అమ్మవు నీవు
నీపై అఘాయిత్యం మానవజాతికి చెరగని మచ్చ
మా నిస్సహాయతకు సిగ్గుపడుతున్నాం
'ఈ దేశాన్ని రామరాజ్యం చేసేస్తాం
ఆడది అర్ధరాత్రి ఒంటరిగా తిరగగలుగుతుంది
ఒక్క చరవాణి సందేశం చాలు చమడాలు ఒలిచేస్తాం'
ఆవన్నీ ఒట్టి మాటలే తల్లీ !
నిన్నెవ్వరూ ఈ భూమ్మీద రక్షించరు
రక్షిస్తున్నామని చెప్పుకొని తిరుగుతుంటారు అంతే!
నిన్ను నువ్వే రక్షించుకోవాలి!
రాక్షసుల్లాంటి మనుషులున్న ఎడారిలో ఉన్నావు
ఈ నేలలో పుట్టినందుకు సిగ్గుతో తలదించుకోకు
ఇప్పుడు నువ్వొక అగ్నిశిఖవు కావాలి
మహంకాళివై, భద్రకాళివై
నీ విశ్వరూపాన్ని అవసరమైన
ప్రతిచోటా చూపించాల్సిందే!

– చిత్రాడ కిశోర్ కుమార్, 9866912906

బహుశా ...

బహుశా
ఆ కామాంధుడు నన్ను చూడకపోయివుంటే
ఆ కఠినాత్ముడు నన్ను ఆశించకపోయివుంటే
ఆ దుర్మార్గుడు నాపై గురి పెట్టకుండా వుంటే
బహుశా
ఆ నీచునికి తల్లిదండ్రులు మంచీ చెడు చెప్పివుంటే
ఆ హీనుడు గురువుల ద్వారా సంస్కారం నేర్చి వుంటే
ఆ క్రూరుడికి తల్లీ చెల్లెళ్ళు గుర్తుకొచ్చివుంటే
బహుశా
ఆ రోజు నేను అక్కడికి వెళ్ళకుండావుంటే
బహుశా
ఇప్పుడు కూడా నేను జీవించివుండేదానిని
ఇప్పుడు కూడా నేను తలెత్తి తిరుగుతూ ఉండేదానిని
ఇప్పుడు కూడా మీకు సేవ చేస్తుండేదానిని
ఇప్పుడు కూడా మీకు స్ఫూర్తి అయ్యేదానిని
బహుశా బహుశా
అయినా నా మరణంలో
మీరు కులాన్ని, మతాన్ని గుర్తుచేసుకోనందుకు
మీరు ఇంకా మానవత్వం ఉన్నవారే అని
మనసులో ఏదో ఒక సన్నని ఆశ మెదులుతోంది
కుట్టిన దోమని, కరచిన పాముని కొట్టి చంపే మీరు
ఆ అమానుష మృగాన్ని ఏం చేస్తారో ...
బహుశా బహుశా ....

– గోళ్ల నారాయణ రావు

చేతికందిన ఆయుధంతో ...

మృగాలు సైతం సిగ్గుపడే తప్పుకు
సహనమెందుకుండాలి?
చెవిన పడ్డ మరుక్షణం
చేతికందిన ఆయుధంతో
శిక్ష అమలు చేయాలి
మనిషి జాతినే అవమానపరిచిన
గాయాన్ని ఏ చర్యలు మాన్పగలవు?
ఇలాంటివి మళ్లీ మళ్లీ జరక్కుండా
ఓ సంపూర్ణ ప్రక్షాళనం జరగాలి!

– చందలూరి నారాయణరావు
97044 37247

ఒక్కరోజు సెలవు కోసం ...

చాలా ఏళ్ళుగా మా తాతవ్వలు
చచ్చిపోతూనే వున్నారు
అక్కకూతురు సంవత్సరానికోసారి
సమర్తాడుతూనే వుంది
ఇద్దరు పిల్లల్ని స్కూలుకి పంపుతున్న తమ్ముడు
నా సెలవు కోసం మళ్ళీ మళ్ళీ పెళ్ళికొడుకౌతున్నాడు
మురుగుపోతున్న ఆర్జిత సెలవులు సాక్షిగా
ఉద్యోగం గొంతు నులుముకుని
చావుకోసం ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటుంది

లేని రోగాల్ని ఒంటికి పులుముకుని
అవసరమైతే ఇంట్లోవాళ్ళకి జబ్బుల్ని అప్పిస్తూ
ఉద్యోగం ఓ సెలవు చీటీలా
అధికారి టేబులుపై రెపరెపలాడుతున్నట్టు కనిపిస్తూనే
గజగజ వణుకుతుంటుంది

అంతమంది కింది వాళ్ళలో
ఏ ఒక్కడూ సరైనోడు కాడని
ఒకే ఒక్కమాటతో చంపి
శవపంచనామా రాయబడుతుంది
మేధావైన భార్య
అర్భక మొగుడితో చేస్తున్న కాపురంలా
ఉద్యోగమూ అంతే...!

అటూ ఇటూ కాని శాఖల్లో పనిచేయడమంటే
విరాట కొలువులో వేషం మార్చిన సవ్యసాచిలా
హొయలు పోవడమే
ఇంకో శాఖ కింద మనగలగడమంటే
సవతి తండ్రి మాటల్లో లాలన వెతుక్కునే కూతురిలా
సందిగ్ధాల సంతలో తప్పిన
ఒంటరి మేకపిల్లలా లోగొంతులో అరవడమే!

నా ఒక్కరోజు సెలవు కోసం
బంధుగణమంతా ఒక్కొక్కరూ రాలిపోతున్నారు
రేపటి సెలవు కోసం
ఇప్పుడిక నేను కూలిపోవాలేమో!?

అయ్యా,
నేనూ చచ్చిపోయాను
నన్ను నేను తగలెట్టుకోవాలి
ఒక్కరోజు సెలవిప్పించండి మహాప్రభో !

– బంగార్రాజు కంఠ, 85003 50464

మాట్లాడదాం.. రండి!

బుక్‌బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్-2024

ఉత్సవం

బుక్‌బ్రహ్మ ఫెస్టివల్‌లో ప్రసంగిస్తున్న ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్

కన్నడ భాషలో హడు అంటే పాడమని, మాతాడు అంటే మాట్లాడమని అర్థం. అసలేం పాడాలి? ఏం మాట్లాడాలి? ఇవాల్టి ప్రశ్న. సుప్రసిద్ధ భారతీయ నడుటు ప్రకాశ్‌రాజ్ 'జస్ట్ ఆస్కింగ్' అంటున్న విషయం అందరికీ తెలుసు. సాహిత్యకారులు ఏమడగాలి? ఏమని ప్రశ్నించాలి? అన్నదే ఇటీవల కర్నాటక రాజధాని బెంగళూరు నగరంలో జరగిన పండుగ. నిజానికి ఇది పండుగ కాదు; నిర్వాహకులు సాంస్కృతిక కళా, సంగీత ప్రదర్శనలు నిర్వహించిన పండుగ వాతావరణం సృష్టించినంత మాత్రానా ఇది పండుగ కాదు. ఇది ఆందోళన. దేశం గురించి ప్రతి పౌరుడూ ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని పాడుతూ, మాట్లాడుతూ సాగిన ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక. ఎవరిచ్చారు ఈ ప్రణాళిక అని అనవచ్చు. ఎవరికి వారు వారి వారి మస్తిష్కంలో జొప్పించిన ప్రగతిశీల భావోద్రేకం. వర్తమాన ప్రపంచంలో మనం అనుసరించాల్సిన భావోద్రేక ప్రణాళిక. దేశం సర్వనాశనమయ్యేందుకు కారణమెవరో ఈ పండుగ తేల్చి చెప్పగలిగింది. దేశవ్యాప్తంగా ప్రగతిశీల సాహిత్యకారులను ఒకచోట చేర్చగలిగింది. నిర్వాహకులు ఫలానా భావజాలం, ఫలానా కార్పొరేట్, ఫలానా కులం, ఫలానా మతం అని అథమ స్థాయిలో ఆలోచించే సాహిత్య కారుకూతలు కూసే వాళ్ళనోళ్ళు మూయించగలిగారు. అందరికీ అవకాశం ఇచ్చి ఉండకపోవచ్చు. వాళ్ళేం ప్రముఖులు కాదు కదా వాళ్ళనెందుకు ఆహ్వానించారు? వీళ్ళనెందుకు వక్తలుగా పిలిచారు అనే చర్చలు ఇప్పుడు తెలుగు కవులు చేస్తున్నారు. అదిప్పుడు అనవసర చర్చ. కారణమేమంటే నిర్వాహకులు కన్నడిగులు. ద్రవిడభాషా కవులతో వాళ్ళకున్న పరిచయాల సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఆహ్వానించి వుండవచ్చు. కానీ వాళ్ళు చేసిన గొప్ప పని మాత్రం ఈ దేశంలో ఉన్మాద శక్తులెలా దేశ ప్రజల మధ్య కులం పేరుతో మతం పేరుతో ఎలా చీల్చి గత ఆంగ్లేయుల పాలన మాదిరి విభజించు పాలించు సిద్ధాంతాన్ని వర్తమాన కాలంలో అమలు చేస్తున్నారో చెప్పగలిగారు. అది కూడా వాళ్ళే చేయలేదు. మనకే వేదికలిచ్చి మిమ్మల్ని మీరు చర్చించుకోండన్నారు. ఆ వేదికలకు మంటప, మథన, అంగల వంటి పేర్లు పెట్టి, సభలను నిర్వహించారు.

ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన కన్నడ తమిళ, మలయాళ, తెలుగు భాషలకు చెందిన కవులు, రచయితలు, అనువాదకులు ఏ భాషకాభాష, ఏ సమయానికి ఆ సభ క్రమశిక్షణగా నిబద్ధతగా సాగాయి.

ఈ నెల 9, 10, 11వ తేదీల్లో జరిగిన బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్-2024 సోల్ ఆఫ్ సౌత్ పేరుతో బెంగళూరు నగరంలోని కోరుమంగల్ ప్రాంతంలోని సెయింట్ జాన్స్ ఆడిటోరియం వేదికయ్యింది. ఈ సభలకు ఆంగ్లం వారధిగా మారింది. రొటీన్‌గా జరిగే సాహిత్య కార్యక్రమాల్లాగా కాకుండా భిన్నంగా కొనసాగడం ఈ పండుగ ప్రత్యేకత. ఈ సాహిత్య పండుగ వ్యవహారంపై సామాజిక మాధ్యమాలోనూ, పత్రికల్లోనూ చర్చలు మొదలయ్యాయి.

అసలు ఉద్దేశ్యం ఏమిటి?

మూడు రోజుల పాటు జరిగిన ఈ సభల్లో చర్చకు ఎక్కువ అవకాశం ఇచ్చారు. ప్రారంభ సెషన్‌లో కన్నడ, తెలుగు, మలయాళ, తమిళ సాహిత్యాల్లో పేరెన్నికగల రచయితలు మాట్లాడారు. వారికి నిర్దేశించిన అంశాలపై చర్చావేదిక తరహాలో ప్రసంగించారు. తెలుగు నుంచి ప్రముఖ రచయిత్రి ఓల్గా 'తెలుగు అనువాదాలు – కొత్త వొరవడి' అన్న అంశంపై ఆంగ్లంలో ప్రసంగించారు. తెలుగు అనువాదాల్లోని సంక్లిష్టతల్ని పరిశోధనాత్మకంగా వివరించారు. ఇతరత్రా కవులు వారి వారి భాషల్లో ఇచ్చిన అంశాలపై లోతుగానే చర్చించారు. ప్రగతిశీల రచయితలు పెరుమాళ్ మురుగన్, వసుధేంద్ర, జయమోహన్, సచ్చిదానందన్, సుప్రసిద్ధ సినీదర్శకులు గిరీష్ కాసరవెల్లి తదితరులు హాజరయ్యారు. వీరంతా తమ ప్రసంగాల్లో ఉమ్మడి శత్రువును సృజనకారుల ముందు బాహాటంగా నిలబెట్టగలిగారు.

ప్రకాష్‌రాజ్ ఏం చెప్పాడు!

'భాషె బేరెయాదరూ భావ వొందే' భాష వేరైనా అనుభూతి వొక్కటే – అనే శీర్షికలో ప్రసిద్ధ నటుడు ప్రకాష్‌రాజ్ పాల్గొని, 43 నిమిషాలు మాట్లాడారు. ఆ ప్రసంగం విన్నాక ఆయన మీద ఉన్న గౌరవం రెట్టింపు అయ్యింది. అందులో ముఖ్యమైన అంశాలు కొన్ని :

1. అసమానత్వం, కుల వ్యవస్థ వంటివి మనం కట్టుకున్న అదృశ్య గోడలు. అవి సామరస్య జీవనానికి అడ్డంకులు. అలాంటి గోడలను కూల్చివేసి వంతెనలు నిర్మించాలి.
2. ఇక్కడి పేదలు విదేశీ అతిథులకు కనపడకూడదని దేశంలోనే ప్రహరీగోడకు ఇరువైపులా గోడ కట్టిన ఘటన మన కళ్ల ముందే ఉంది. మరోవైపు కనిపించని గోడలు చాలా ఉన్నాయి. యుద్ధం, అసమానత వంటి గోడలు కట్టడం మన స్వీయ గాయాలు. గోడ వేర్పాటుకు చిహ్నమైతే, వంతెన అనుసంధానానికి చిహ్నం. నిర్మించాలనుకుంటే వారధిని మనమే కట్టుకుందాం.
3. బెంగళూరులో సమస్యలు ఉండవచ్చు కానీ పిల్లలకు కన్నడం నేర్పాలంటే రాజకీయ సంకల్పం కావాలి.
4. ఎన్నో భాషలు వచ్చినా సెంటిమెంట్ ఒకటే. లిపి, పదాలు వేరైనప్పటికీ, భాష మనిషి యొక్క అనుభూతిని కలిగి ఉంటుంది. అసమానత, అన్యాయాల ప్రపంచాన్ని మార్చడానికి మనమందరం భాషలు వేరైనా భావం ఒక్కటే! కాబట్టి ఐక్యమవ్వాలి.
5. కువెంపు రచించిన 'విశ్వ మానవన సందేశం' విప్లవం విశ్వవ్యాప్తం కావడమే! హద్దులు దాటి మానవీయ విలువలను పెంపొందించాలి. మన మధ్య నిర్దిష్ట రాజకీయ భావజాలం లేకపోవొచ్చు కానీ, సామాజిక సామరస్యం మాత్రం ఉంది.
6. భాషను పోరాటానికి ఆయుధంగా ఉపయోగించకూడదు. భాషను వారధిగా ఉపయోగించడం ద్వారా మన గుర్తింపును మనం కాపాడుకోవచ్చు. నేను ఇప్పుడు బహుళ భాషలు మాట్లాడగలను. నా కన్నడ మూలమే కారణం. చిన్న పిల్లలకు కన్నడ నేర్పడం అంటే వ్యాకరణాన్ని బోధించడం మాత్రమే కాదు.

7. దేశం సంక్లిష్టతల్ని ఎదుర్కొంటుంది. సమస్యల్ని ఎదుర్కొంటుంది. దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులు అధికారంలో ఉన్నాయి. దేశంలో ఒకరకంగా మనుగడే ప్రశ్నార్థకంగా మారిన స్థితిలో మనమున్నాం. మనకు కావాల్సింది యుద్ధాలు కాదు.. మనకు కావాల్సింది శాంతి.. సామాన్యులకు స్థితివంతమైన స్వేచ్ఛా జీవితం. ఇవన్నీ లేకపోతే మాట్లాడొద్దా మనం? రండి మాట్లాడండి.. రండి పాడండి..

కన్నడ కవి కువెంపు, మహాకవి శ్రీశ్రీ, బసవేశ్వరుడు, తమిళ, మలయాళ కవుల కవితలతో పాటు పాలస్తీనా కవుల కవితలనూ ప్రకాశ్ రాజ్ తన ప్రసంగంలో వినిపించారు. నటుడిగా మనకు కనిపించే ప్రకాశ్‌రాజ్ గొప్ప మేధావిగా దేశం నలుమూలల నుంచి వచ్చిన సాహిత్యకారుల నడుమ ఆవిష్కరింపబడ్డారు.

ఎవరెవరు హాజరయ్యారు?

ఈ సభలకు తెలుగు రాష్ట్రాల నుంచి సాహితీవేత్త కాత్యాయనీ విద్మహే, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ మృణాళిని, కుప్పిలి పద్మ, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, కథారచయితలు వేంపల్లి షరీఫ్, మహమ్మద్ ఖదీర్‌బాబు, ప్రముఖ దళిత స్త్రీవాద కవులు జూపాక సుభద్ర, ఎంఎం వినోదిని, ఎండ్లూరి మానస, చల్లపల్లి స్వరూపరాణి, ప్రముఖ అనువాద రచయితలు కాత్యాయినీ, అవినేని భాస్కర్, పూర్ణిమ తమ్మిరెడ్డి, దూర్జటి వెంకట శుభశ్రీ, కెఎన్ మల్లీశ్వరి, పి.జ్యోతి, అక్కినేని కుటుంబరావు, గోగు శ్యామల, మల్లిపురం జగదీశ్, రమేశ్ కార్తీక్ నాయక్, వివిన మూర్తి, పుస్తక ప్రచురణ సంస్థ ఛాయా నుంచి ఎడిటర్ అరుణాంక్ లత తదితరులు హాజరయ్యారు. అనేక అనేకమంది తెలుగు కవులూ రచయితలూ ఈ సభల్లో పాల్గొని, ప్రసంగాలను విన్నారు. వివిధ ప్రాంతాల రచయితలతో ముచ్చటించారు.

తెలుగు సాహిత్యంలో ఏం చర్చించారు?

మూడు రోజులూ ఉదయం 9 నుంచి ప్రారంభమైన సభలు, రాత్రి 8 వరకు సాగాయి. ద్రావిడభాషల్లో అనేక అంశాలపై ఆయా భాషా సాహిత్య ప్రముఖులతో చర్చలు జరిపారు. తెలుగు సాహిత్యం విషయానికొస్తే – తెలుగు అనువాదాలు–కొత్త ఒరవడి, స్త్రీవాదం నుండి దళితస్త్రీవాదం వైపు, తెలుగులో స్త్రీల ఆత్మకథలు, సమకాలీన తెలుగు నవల, తెలుగు కథా ప్రపంచం, తెలుగు సబాల్టర్ స్వరాలు ... చర్చకు వచ్చిన అంశాలు. ఇవి కాకుండా అక్షర, పుస్తక, చిన్నారలోక అంటూ ఏర్పాటు చేసిన ఉప వేదికలు ఆకట్టుకున్నాయి.

సాంస్కృతిక సంరంభం

సాహిత్యాన్ని అభినయకళగా రూపొందించి ప్రదర్శించే సంస్కృతి కన్నడనాట బసవేశ్వరుడి కాలం నుంచీ కొనసాగుతున్నదే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక దాని మరింత విస్తృతమైంది. బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవంలోనూ సాహిత్య అభినయ ప్రదర్శన అందరినీ అబ్బురపరిచింది. కావ్యాభినయ (పోయెట్రీ ఇన్ యాక్షన్), కన్నడ కావ్యకణజ, మార్నింగ్ మెలోడీ, సమతె మత్తు, మమతెయ సోల్లుగళు(వర్డ్స్ ఆఫ్ ఈక్వాలిటీ అండ్ ఎన్‌డీయర్‌మెంట్) శాస్త్రీయ గాయన, హిందూస్తానీ సంగీత, భాషెబేరాదరూ భావవొందే, కావ్యాభివ్యక్తి, పంచవటి యక్షగాన తదితరాలన్నీ సుప్రసిద్ధులతో ప్రదర్శింపజేశారు. వీటిలోనూ ప్రగతిశీల ప్రదర్శనలుండటం గమనార్హం.

అసంతృప్తి ఏంటంటే ...

కన్నడనాట ప్రముఖ పబ్లిషర్స్ పుస్తకాలు వివిధ స్టాళ్ళల్లో ప్రదర్శనకు పెట్టారు. తమిళ, మలయాళ, ఆంగ్ల సాహిత్యాల పేరెన్నిగల స్టాళ్ళు ఉన్నాయి. తెలుగు పబ్లిషర్స్ స్టాళ్ళు లేకపోవడం తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఎన్‌బిటి పుస్తక ప్రదర్శన స్టాల్‌లో కొన్ని తెలుగు పుస్తకాలు కలసి ఉండటం, ఓల్గా ఒక మూలన తన పుస్తకాలను ప్రదర్శనకు ఉంచడం మినహా తెలుగు పుస్తకాల ప్రదర్శన కనిపించలేదు. ఇదే విషయాన్ని ఈ సభలకు అతిథిగా హాజరైన తెలుగులో ప్రముఖ పబ్లిషర్ సంపాదక మిత్రుడినడిగితే ఇది చాలా వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారమని కొట్టిపడేశారు.

ఈ వొరవడి కొనసాగాలి!

మనం ప్రమాదంలో ఉన్నామనే సంకేతం ఈ సభలు తెలియజేశాయి. కర్తవ్యాన్ని గుర్తు చేశాయి. ఇలాంటి సభలు నిర్వహించడం చాలా కష్టంతో కూడుకున్న పనే అయినా.. నిర్దిష్ట ప్రణాళికలతో విజయవంతం చేయొచ్చు. ఈ సభలను కార్పొరేట్ స్థాయి అని, ఈ సంస్కృతికి వ్యతిరేకమని చెప్పిన కొందరు కవిమిత్రులు కూడా వీటిని వీక్షించి ఇలాంటివి చేయాల్సిందే అని అభిప్రాయపడ్డారు. తెలుగు నాట ఆ కృషి కార్యరూపం దాల్చాలి. దేశమంతా విస్తరించాలి.

– కెంగార మోహన్, 94933 75447

పుస్తక వేదికపై తమ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితలు రాధేయ, మోహన్, రొక్కం కామేశ్వరరావు

ఐక్యబలాన్ని చాటే గంగజాతర

పుస్తకం

మూలాలను నిత్యం స్మరించుకుంటూ, మాట, పిలుపు, పలుకు, తిండి, బట్ట, కష్టం, సుఖం, పండగ, జాతర, ఊరేగింపు, పుట్టుక, చావు వంటి అనేక విషయాల్లో నిండైన జీవితం ఉట్టిపడేలా మాదిగపల్లి మనుషులను, జీవితాలను నిండుగా చూపిస్తూ 'గంగజాతర' నవలికను రాశారు కవి, రచయిత దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి. ఇది కేవలం మాదిగపల్లి చరిత్ర మాత్రమే కాదు 'పాలేటి కింద ఉన్న పద్నాలుగు గ్రామాలను' కబళిస్తున్న ఫ్లోరైడ్ భూతాన్ని అంతమొందించడానికి సాగిన పోరు– తాగునీటి పోరాటం! కులాలకతీతంగా పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజల, పశువుల నీటి వెతలు, ఆత్మఘోష ఈ నవలిక.

తక్కువ పేజీలతో చెప్పాలనుకున్నదాన్ని అతి తక్కువ మాటలలో చెప్పడం రచయిత ప్రత్యేకత. ఈ రచయిత ... కవి కూడా అవడం చేత కొన్ని వర్ణనలు చాలా స్ట్రైకింగ్‌గా ఉంటాయి. ఉదాహరణకు కొన్ని :

"సూర్యుడు ఆశీర్వాదాన్ని చేయి పట్టుకు తీసుకుపోతున్నాడా అన్నట్టు అస్తమించాడు. ఆశీర్వాదం కన్ను మూసాడు."

"వాహనభేరి ఊరు దాటిపోయింది. వర్షం కురిసి వెలసినట్టుంది."

"రెండు ఆంబోతుల కొట్లాటలో లేగదూడ నలిగిపోయినట్టు మన మాదిగ పల్లెను నిలిపేశారు పెత్తందార్లు"

"ఎండలు కాసినంత సమృద్ధిగా వాన కురవచ్చుగా! ఆకాశమం మీద మబ్బులేనట్లు కల్లెపు చల్లిపోద్దేందిరా."

ముందుగా చెప్పుకున్నట్టుగా, ఇది మాదిగపల్లితో మొదలై మాదిగపల్లితో ముగిసే కథ మాత్రమే కాదు. మాదిగ ఉపకులాలు కూడా సమాన స్థాయిలో ఆదరణ పొందాలని ఆశించే నవల. ఆయా ప్రాంతాల నుంచి పనుల కోసమంటూ మాస్టీన్, ఆసాది, బైండ్ల, చిందు మాదిగ ఉప కులాలు చింతల తోపులో నాలుగు మూలలా డేరాలు ఏసుకుంటారు. "మాదిగ పల్లె కంటే చింతలతోపుకు కళొచ్చింది" అని మాదిగ, దాని ఉపకులాలు కలిసి వుండడంలోని అందాన్ని, ఆనందాన్ని తెలియజేస్తాడు. "రండి... రండోయ్ ఉన్నదాంట్లోనే అందరం కలో గంజో తాగుదాం," అని ఆహ్వానిస్తాడు మాదిగ పెద్ద ఎంకటరత్నం. ఆ ఉపకులాలు మరోచోట పని వెతుక్కుంటూ వెళ్లిపోతే వెలితిగా ఫీల్ అవుతాడు.

కథలో అభ్యుదయ భావాలు కలిగిన టీచర్, ఉద్యమకారుడు అయిన సంజీవ్ హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీకి ఉన్నత చదువుకు వెళ్ళినప్పుడు వాళ్ళ బిడ్డకు జాగ్రత్తలు చెప్తూ అమ్మ రాసిన ఉత్తరానికి జవాబుగా "సంజీవి! నువ్వు చిందు, నేను మాదిగ, కోటి మాల. తారతమ్యాలు లేకుండా ఓ చదువుల సాహిత్య కుటుంబం ఇక్కడ ఉందని అమ్మకు ఉత్తరం రాయరా తండ్రీ," అంటాడు నాగప్పగారి సుందర్రాజు. దళిత కులాలైన మాల–మాదిగ, వాటి ఉప కులాల మధ్య ఉండాల్సిన సోదర భావం, సోదర ప్రేమను తెలియజేస్తుందీ ఉదంతం. మనందరం ఒకే జాతి, ఒకే వర్గం. కష్టాలు కలిసి పంచుకోవాలిరా అంటాడు.

తాగు, సాగు నీటికి వెతలు తీరాలంటే అక్కడ ఒక రిజర్వాయర్ కట్టాలి. అందుకు దీర్ఘకాలంగా ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి. దానికి ప్రజలందరి మద్దతు కావాలి. అప్పుడు అంటాడు సంజీవి, "మాదిగలవైపు నుంచి ఉద్యమం, పోరాటం అంటే మిగతా కులాలు సహకరించరు. వాళ్ళు సహకరించకపోయినా మన పద్నాలుగు మాల మాదిగలు నడుం బిగిస్తే పాలేటి మీద కట్ట శ్రమదానంతో మూడేళ్ళలో నిర్మించుకోగలం," అని. మాల మాదిగల సమైక్య పోరాట అవసరాన్ని తెలియజేస్తుంది ఈ ఉదంతం. ఈ కథలో వాళ్ళు (మాల–మాదిగలు) సమైక్యంగా పోరాడి సాధించాల్సింది కొద్ది ప్రాంతపు నీటి అవసరం అయితే, నిజ ప్రపంచంలో వారు సమైక్యంగా పోరాడి సాధించాల్సింది రాజ్యాధికారం అనే వాస్తవానికి రచయిత సంజీవి అనే పాత్ర ద్వారా పలికించిన ఈ మాటలు స్ఫూర్తిగా నిలుస్తాయి.

భర్త చనిపోయినా తండ్రిని ఆశ్రయించకుండా, ప్రలోభాలకు లొంగకుండా నిండైన ఆత్మ గౌరవంతో ముందుకు సాగి పిల్లలను సాకడమే కాకుండా తాను టీచర్ ట్రైనింగ్ చేయడం, సంజీవితో కలిసి పోరాటంలో భాగం కావడం ద్వారా 'గంగ' అనే పాత్ర దళిత ఆదర్శ యువతిగా కనిపిస్తుంది. తాను చదువు చెప్పే పిల్లలే తనకు సొంతపిల్లలు కావాలి అని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న 'సంజీవి' పాత్ర ద్వారా దళితులకు నిస్వార్థ నాయకుల అవసరాన్ని తెలియజేస్తాడు రచయిత. ఉదాత్త భావాలు కలిగిన ఈ ఇద్దరు చివర్లో దండలు మార్చుకుని ఒకటవతారు. గంగ బిడ్డలు తన బిడ్డలుగా స్వీకరిస్తాడు సంజీవి. మాదిగ పిల్ల గంగ, చిందు కులపు సంజీవి వివాహం మాదిగ దాని ఉపకులాల మధ్య వివాహ బంధాన్ని అవశ్యకాన్ని సూచిస్తుంది. ఈ సందర్భంలో మాల మాదిగల మధ్య 'కంచం పొత్తు, మంచం పొత్తు లేదు' అనే వాదనను కూడా ఒక సారి గుర్తు చేసుకోవడం అవసరం. ఒక వేళ ఈ మాట మాల మాదిగల మధ్య రిలేషన్‌ను ఆశిస్తూ అంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఇదే మాటను ఈ రెండు కులాల మధ్య నెర్రెను లోతుగా విశాలంగా మార్చాలనే ప్రయత్నంతో అంటే అంతకంటే దుర్మార్గం ఇంకోటి ఉండదు. ఎందుకంటే నాకు తెలిసే ఎన్నో మాల–మాదిగ జంటలు వివాహ బంధంలో ఒక్కటై పరస్పర గౌరవంతో విజయవంతంగా సంసారాన్ని సాగిస్తున్నాయి. మాల–మాదిగ వాటి ఉపకులాల మనుషులే గాక, "ఒరే ఎంకటనర్సు... నీ కుతురు గంగమ్మను నా కొడుకు ఎంగల రెడ్డికి ఇస్తావంటరా!" అని అడిగే పిచ్చిరెడ్డి లాంటి కులాల కంపు విదుల్చుకోవాలని ప్రయత్నం చేసే అగ్రకుల వ్యక్తులు కూడా ఈ కథలో కనిపిస్తారు.

ఇది చక్కగా సింగల్ సిట్టింగ్‌లో చదివేయగల నవల. మాదిగ సంస్కృతికి రెఫరెన్స్ బుక్‌లా మారగల నవల. ఈ మధ్యే రిటైర్ అయ్యి కావాల్సినంత తీరిక పొందిన ఎజ్రాశాస్త్రి అన్న నుంచి మరిన్ని నవలలు ఆశించవచ్చు.

– సురేంద్రబాబు రేగులగడ్డ

దీపావళి కథల పోటీ

సమాజంలో మంచిని పెంచడం, మనుషుల్లో ఉన్నత విలువల్ని ప్రోది చేయడం, హృదయ సంస్కారానికి తావు నివ్వడం లక్ష్యంగా డాక్టర్ అమృతలత – పాలపిట్ట సంయుక్తంగా ఈ ఏడాది (2024) దీపావళి కథల పోటీ నిర్వహించాలని సంకల్పించాయి. అన్ని ప్రాంతాల తెలుగువారు ఈ పోటీకి తమ కథలని పంపించవచ్చు.

నిబంధనలు : ఇతివృత్తం రచయితల అభీష్టం. సామాజిక కల్లోలాలే కాదు, మానవ అంతరంగాల్లోని ఘర్షణలనూ ఇతివృత్తాలుగా ఎంపిక చేసుకోవచ్చు. పోటీకి పంపించే కథలు ఎక్కడా ఏ రూపంలోనూ ప్రచురితం, ప్రసారమూ అయి ఉండకూడదు. కంపోజ్ చేసి పంపించేవారు వర్డ్ ఫైల్‌తో పాటు పిడిఎఫ్ జత చేయాలి. అను ఫాంట్స్‌లోనూ కథలను కంపోజ్ చేసి పంపించవచ్చు. కథను కాగితాల మీద రాసి పంపించేవారు, పోస్టు చేయడం మంచిది. పేజీల పరిమితి లేదు. పోటీలో ఎంపికయ్యే కథలు పాలపిట్టలో ప్రచురితమవుతాయి. మీ కథలు పంపించడానికి చివరి తేదీ: 25 సెప్టెంబర్ 2024. పోటీ ఫలితాలు ప్రకటించే తేదీ : 15 అక్టోబర్ 2024.

బహుమతుల వివరాలు : మొదటి బహుమతి: రూ. 10 వేలు, రెండో బహుమతి: రూ. 6 వేలు, మూడో బహుమతి : రూ. 4 వేలు. మరో పది కథలకు రూ.వెయ్యి చొప్పున ప్రత్యేక బహుమతులు ఉంటాయి. కథలు పంపాల్సిన చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 3, బ్లాక్–6, ఏపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్– 500044. ఫోను: 94900 99327. ఈమెయిల్ : palapittabooks@gmail.com

– గుడిపాటి, ఎడిటర్

విద్యార్థులకు మినీ నవలల పోటీ

వురిమళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు (ఇంటర్, డిగ్రీ వరకు) విద్యార్థులకు మినీ నవలల పోటీ నిర్వహిస్తున్నాం. పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ దృక్పథం, మానవీయ సంబంధాలు వంటి అంశాల ఆధారంగా 30 పేజీలకు తగ్గకుండా రాసే నవలలకే ప్రాధాన్యత ఉంటుంది. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులతో పాటు రెండు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. మీ నవలలకు పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపించాలి. నవలలు పంపించడానికి ఆఖరు తేదీ : సెప్టెంబర్ 30, 2024. చిరునామా : వురిమళ్ల సునంద, ఇంటి నెంబర్ 11–10– 694/5, బురహన్ పురం, ఖమ్మం, 507001. పూర్తి వివరాలకు 94947 73969 నెంబరుకు సంప్రదించాలి.

– వురిమళ్ల సునంద.

కవితలకు, వ్యాసాలకు ఆహ్వానం

తొలితరం దళిత మహాసభ ఉద్యమంలో పాల్గొన్న బహుజన సాంస్కృతిక యోధురాలు, గాయకురాలు ఆతవ సముద్రమ్మపై ప్రత్యేక సంచిక తీసుకొస్తున్నాం. ఆతవ సముద్రమపై మీ వ్యాసాలను, కవితలను పంపగలరు. చివరి తేదీ : సెప్టెంబరు 10, 2024. వివరాలకు తంగిరాల సోని 96766 09234ని సంప్రదించగలరు.

– ఆతవ ఉదయ భాస్కర్, 95022 36314

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..

prajasavvadi@gmail.com

వ్యవసాయంలోనూ అసమానతలే

- ఆదాయాలు అంతంత మాత్రమే
- అరకొరగా శాశ్వత ఆవాసాలు
- భూకమతాలూ తక్కువే
- వెనుకబడిపోతున్న ఎస్‌టి, ఎస్‌సి, ఒబిసిలు

న్యూఢిల్లీ : దేశంలో సామాజిక ఆర్థిక అసమానతలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఆదాయాలు, భూయాజమాన్యాలకు సంబంధించి ఈ అసమానతలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నట్లు కులగణన చేపడితే భూయాజమాన్యంలో కులపరమైన ఆధిపత్యం ఏ మేరకు ఉన్నదో అంచనా వేయవచ్చు. దేశంలో వ్యవసాయ కుటుంబాల భూయాజమాన్య వివరాలను తాజా సర్వే నమోదు చేసింది. 2018-19లో వ్యవసాయ కుటుంబాల పరిస్థితిపై మదింపు సర్వే (ఎస్‌ఎఎస్) నిర్వహించారు. ఇప్పటి వరకూ ఎస్‌ఎఎస్ సమాచారాన్ని మూడు దఫాలుగా సేకరించారు. 2003, 2013, 2018-19లో సమాచార సేకరణ జరిగింది. భవిష్యత్తులో ఎప్పుడు సమాచారాన్ని సేకరిస్తారనే విషయంపై మంత్రిత్వ శాఖ వెబ్‌సైటులో వివరాలేవీ ఇవ్వలేదు.

ఐదు సంవత్సరాలకు ఒకసారి చేసే వ్యవసాయ గణన కూడా భూ కమతాలకు సంబంధించి సమాచారాన్ని అందించే మరో వనరు. చిట్టచివరగా 2015-16లో ఈ సర్వే వివరాలు విడుదలయ్యాయి. 2021-22లో సమాచార సేకరణ ప్రారంభమైనప్పటికీ అది ఇప్పటివరకూ బహిర్గతం కాలేదు. కాబట్టి చిట్టచివరగా జరిపిన సర్వేలనే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

సగటు వినియోగ వ్యయంలో...

బిజెపి ఏలుబడిలో గ్రామీణ ఆదాయాలు, భూ యాజమాన్యాల గురించి ప్రభుత్వ వాదనలను అంచనా వేయడం చాలా కష్టంగా ఉంది. 2018-19లో జరిపిన ఎస్‌ఎఎస్ సర్వే సమాచారం కుల ఆధారిత భూ యాజమాన్యాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ముందుగా నెలవారీ సగటు వినియోగ వ్యయాన్ని (మంత్లీ కన్సప్షన్ ఎక్స్‌పెండిచర్- ఎంసిఇ)ని పరిశీలిద్దాం. ఎంసిఇ అనేది కుటుంబ ఆదాయానికి సూచిక అని చెప్పవచ్చు. ఈశాన్య రాష్ట్రాలలో వివిధ కులాల మధ్య ఎంసిఇ పంపిణీ సమానంగానే ఉంది. మిగిలిన ప్రాంతాలు... అంటే ఉత్తరాది రాష్ట్రాలు, మధ్య ప్రాంత రాష్ట్రాలు, తూర్పు రాష్ట్రాలు, పశ్చిమ రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాలలో జనరల్ కేటగిరీ కుటుంబాల వ్యయమే అధికంగా (రూ.10,611) ఉంది. ఎస్‌టి కుటుంబాలు అతి తక్కువ మొత్తంలో (రూ.8,204) ఖర్చు చేస్తున్నాయి. మధ్య, దక్షిణాది రాష్ట్రాలలో జనరల్ కేటగిరీ కుటుంబాల సగటు ఎంసిఇ ఎస్‌టి కుటుంబాల ఎంసిఇ కంటే దాదాపు రెట్టింపుగా ఉండడం గమనార్హం. అన్ని ప్రాంతాలలోనూ ఎస్‌సి కుటుంబాల ఎంసిఇని ఎస్‌టి కుటుంబాలతో పోల్చవచ్చు. ఒబిసి కుటుంబాల ఎంసిఇ జనరల్ కేటగిరీ కుటుంబాల వ్యయానికి దగ్గరగా ఉంది. ఈశాన్య ప్రాంతంలో మినహా మిగిలిన అన్ని చోట్ల ఇతర కులాలతో పోలిస్తే ఎస్‌టి కుటుంబాల వ్యయం ఇప్పటికీ బాగా తక్కువగానే ఉంది.

పక్కా ఇళ్ల నిర్మాణంలోనూ...

ఇక గ్రామీణ ప్రాంతాలలో శాశ్వత గృహాలు నిర్మించుకున్న వారిలో ఎక్కువ మంది జనరల్ కేటగిరీ కుటుంబాలకు చెందిన వారే. ఒక్క ఈశాన్య ప్రాంతంలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. అక్కడ మినహా మన గ్రామాలలో 57 శాతం జనరల్ కేటగిరీ కుటుంబాలు పక్కా ఇళ్లలోనే నివసిస్తున్నాయి. ఎస్‌టిలలో 27 శాతం మంది, ఎస్‌సిలలో 36 శాతం మంది మాత్రమే శాశ్వత ఆవాసాలలో ఉంటున్నారు. మధ్య రాష్ట్రాలలో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంది. అక్కడ ఎస్‌టిలలో 18 శాతం, ఎస్‌సిలలో 33 శాతం మందికే శాశ్వత నివాసాలు ఉన్నాయి. అక్కడ జనరల్ కేటగిరీలో ఏకంగా 64 శాతం కుటుంబాలకు పక్కా ఇళ్లు ఉన్నాయి. ఉత్తరాదిలో 42 శాతం ఎస్‌టి, 44 శాతం ఎస్‌సి, 67 శాతం జనరల్ కేటగిరీ కుటుంబాలకు, దక్షిణాన 41 శాతం ఎస్‌టి, 45 శాతం ఎస్‌సి, 59 శాతం జనరల్ కేటగిరీ కుటుంబాలకు శాశ్వత ఆవాసాలు ఉన్నాయి.

భూ యాజమాన్యంలో...

భూ యాజమాన్యం విషయంలో కూడా జనరల్ కేటగిరీ కుటుంబాలతో పోలిస్తే ఎస్‌టి, ఎస్‌సి, ఒబిసి కుటుంబాలకు తక్కువ భూమే ఉంది. మొత్తంగా చూస్తే నెలసరి వినియోగ వ్యయం, పక్కా గృహాల యాజమాన్యం విషయంలో జనరల్, ఒబిసి కేటగిరీ కుటుంబాల కంటే ఎస్‌టి, ఎస్‌సి కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. భూ యాజమాన్యం విషయంలో కూడా ఇతర సామాజిక గ్రూపులతో పోలిస్తే జనరల్ కేటగిరీ కుటుంబాలకే ఎక్కువ భూమి ఉంది. ఫలితంగా ఉత్పాదక ఆస్తుల యాజమాన్యం విషయంలో వారి ఆధిపత్యమే కొనసాగుతోంది. తద్వారా వారు సామాజిక, ఆర్థిక ప్రాబల్యాన్ని కనబరుస్తున్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా డిమాండు చేస్తున్నట్టు, కులగణన జరిపితే ఈ విషయంలో మరింత స్పష్టత వస్తుందని ఒక అధ్యయనం వెల్లడించింది.

హర్యానాలో నువ్వా? నేనా?



- ఢీకొంటున్న బిజెపి, కాంగ్రెస్

చండీగఢ్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో నువ్వా? నేనా? అన్నట్టుగా పోటీ పడేందుకు కాంగ్రెస్, బిజెపిలు సన్నద్ధమవుతున్నాయి. హర్యానాలో 90 స్థానాలకు అక్టోబర్ 1న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు అక్టోబర్ 4న వెలువడనున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత హర్యానాలో కాంగ్రెస్, బిజెపి ముఖాముఖి తలపడుతున్నాయి. హర్యానా ఎన్నికలలో బిజెపి, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జెజెపి, ఇండియన్ నేషనల్ లోక్ దళ్, బిఎస్‌పి కూటమి పోటీలో ఉన్నాయి. ఢిల్లీలో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, ఆప్ హర్యానాలో విడివిడిగా పోటీ చేయడం కీలకం.

లోక్‌సభలో కాంగ్రెస్ ఖాతా తెరిచింది

అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయమని కాంగ్రెస్ చెబుతోంది. హర్యానాలో 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన కాంగ్రెస్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 5 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ ఓట్ల శాతం 2019లో 28.51 శాతం నుంచి 43.67 శాతానికి పెరిగింది. అంటే సీట్లతో పాటు ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుకోవడంలో కాంగ్రెస్ విజయం సాధించింది. బిజెపి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ గెలుపు అంత సులభం కాదని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ కోల్పోయిన రైతుల మద్దతు పొందేందుకు ఎన్నికల తేదీల ప్రకటనకు ముందు పలు పథకాలను ప్రకటించారు.

హర్యానా ఎన్నికల్లో ఈ మూడు కీలక అంశాలు

హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో మూడు కీలక అంశాలు ముడిపడి ఉన్నాయి. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అమలు చేయని బిజెపి తీరుపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. అగ్నివీర్ పథకంపై యువతలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు సంబంధించి నిందితులకు వత్తాసు పలకడంపై ప్రజలు భగ్గుమంటున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి మూడు నల్ల చట్టాలు రద్దు చేసినప్పటికీ, హర్యానా, పంజాబ్‌లలో రైతులు ఇప్పటికీ ఎంఎస్‌పి డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. చాలా నెలలుగా హర్యానా-పంజాబ్ సరిహద్దులో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఇటీవల పార్లమెంట్‌లో రాహుల్ గాంధీని రైతు సంఘం కలిసింది. ఎంఎస్‌పిపై రైతులకు చట్టపరమైన హామీ ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. కానీ పార్లమెంట్ సమావేశాలను మోడీ సర్కార్ ముగించింది.

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో రైతుల సమస్య పై చేయిగా మారింది. సామాజిక సమీకరణాల ద్వారా గెలుపొందాలని భావిస్తోంది. మనోహర్ లాల్ ఖట్టర్‌ను తొలగించి, నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. రాష్ట్ర అధ్యక్షుడి కుర్చీపై బ్రాహ్మణ ముఖాన్ని ఉంచి, జాట్ ఓటును చీల్చేందుకు, కాంగ్రెస్ రెబల్, హర్యానా మాజీ సిఎం బన్సీలాల్ కోడలు కిరణ్ చౌదరిని పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు కిరణ్ చౌదరి ప్రవేశంతో జాట్ కమ్యూనిటీ ఆగ్రహాన్ని బిజెపి తొలగించగలదా? అనేది ప్రశ్న. హర్యానాలో బిజెపి దృష్టి జాట్-యేతర ఓటర్లపైనే ఉంది. కాంగ్రెస్ దృష్టంతా జాట్, దళిత ఓటర్లపై ఉంది. ఐఎన్‌ఎల్‌డి, జెజెపి ప్రభావం ప్రధానంగా జాట్ ఓటర్లకే పరిమితమైంది. హర్యానా కుల సమీకరణాలు ఏమేరకు ప్రభావం చూపుతాయనేది వేచిచూడాలి.

ఈ ప్రశ్నలకు బదులేది?

- 'బ్లాక్‌స్టోన్'తో సెబీ చీఫ్ సంబంధాలపై అనేక అనుమానాలు

న్యూఢిల్లీ : పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ తనపై చేసిన ఆరోపణలను సెబీ చీఫ్ మాధబి పురి బచ్ ఇటీవల తోసిపుచ్చారు. అదానీ గ్రూపునకు చెందిన ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో మాధబికి వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయం తెలిసిందే. ఇతర కంపెనీలతో ఆమె సంబంధాలపై కూడా పలు ప్రశ్నలు తలెత్తాయి. వీటికి ఇప్పటి వరకూ సమాధానాలు లభించలేదు. ముఖ్యంగా అమెరికాకు చెందిన ప్రైవేటు ఈక్విటీ సంస్థ బ్లాక్‌స్టోన్‌తో మాధబికి ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో "విరుద్ధ ప్రయోజనాల" (కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్) పై అనేక ప్రశ్నలను ఆర్థిక నిపుణులు లేవనెత్తారు.

'బ్లాక్‌స్టోన్ సంస్థ భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టింది. అది భారత్‌లో అనేక కంపెనీలకు ప్రమోటర్‌గా వ్యవహరించింది. భారత్‌లో బ్లాక్‌స్టోన్ పెట్టిన భారీ పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుంటే మాధబి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నంత మాత్రాన సరిపోదని అర్థమవుతోంది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని సీనియర్ ఫండ్ మేనేజర్ ఒకరు 'ది మార్నింగ్ కాంటెస్ట్' పోర్టల్‌కు తెలిపారు. బ్లాక్‌స్టోన్‌తో సెబీ చీఫ్ సంబంధాలను గమనిస్తే హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు ప్రశ్నలు. లేవనెత్తుతూనే ఉంటాయని అర్థమవుతోంది. మాధబి సెబీ అధిపతి కాకముందే బాగా పేరున్న ప్రైవేటు రంగ ఎగ్జిక్యూటివ్ అని, దీనివల్ల "విరుద్ధ ప్రయోజనాలు" చేకూరే అవకాశం ఉన్నదని సెబీ గుర్తించాల్సి ఉంటుంది. బ్లాక్‌స్టోన్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలలోనూ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నానని మాధబి ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. బ్లాక్‌స్టోన్‌కు పలు అనుబంధ సంస్థలు ఉన్నాయి. వీటిలో కొన్ని సొంతవి కాగా మరికొన్ని ఎక్కువ వాటాలు కలిగినవి. ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ (ఇప్పుడు సమ్మాన్ క్యాపిటల్), ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్, ఏఎస్‌కే ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్, కేర్ హాస్పిటల్స్, ఎంఫసిస్ సహా పలు ప్రధాన కంపెనీలలో బ్లాక్‌స్టోన్ భాగస్వామి. బ్లాక్‌స్టోన్‌కు వాటాలు ఉన్న అన్ని కంపెనీల వ్యవహారాలలో మాధబి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నారా, ఆ జాబితాలో ఎన్ని బ్లాక్‌స్టోన్ కంపెనీలకు స్థానం లభించింది అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఇప్పటి వరకూ సెబీ కానీ, మాధబి కానీ ఆ జాబితాను బహిర్గతం చేయలేదు.

బ్లాక్‌స్టోన్ అజమాయిషీలో ఉన్న ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐపిఒకు ఫిబ్రవరిలో సెబీ అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో మాధబి సెబీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. 2019 ఏప్రిల్-అక్టోబర్ మధ్యకాలంలో బ్లాక్‌స్టోన్ తన అనుబంధ సంస్థ అయిన ఎప్సిలాన్ బిడ్కో ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఎస్సెల్ ప్రోపాక్ లిమిటెడ్ (ఇప్పుడు ఇపిఎల్ లిమిటెడ్)లో 75 శాతం వాటాలు కొనుగోలు చేసింది. వీటిలో 51 శాతం వాటాలు అశోక్ గోయల్ ట్రస్ట్‌కు చెందినవే. ఈ ట్రస్టుకు చెందిన నాయకత్వ సలహా బోర్డులో అతుల్ గోయల్ సభ్యుడు. ఇపిఎల్‌లో ట్రస్టుకు ప్రస్తుతం 7.6 శాతం వాటాలు ఉన్నాయి. ఇప్పుడది పబ్లిక్ వాటాదారుగా పరిగణించబడుతోంది. 2019 జులైలో మాధబి భర్త ధావల్ బచ్ సీనియర్ సలహాదారుగా బ్లాక్‌స్టోన్‌లో చేరారు. అతుల్ గోయల్, ఆయన కంపెనీ ఇ-సిటీ హై-టెక్ ప్రాజెక్ట్స్‌కు వ్యతిరేకంగా దాఖలైన ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసును 2021 ఆగస్ట్ 27న సెబీ హోల్‌టైమ్ సభ్యురాలిగా మాధబి పరిష్కరించారు. ఈ వ్యవహారాలన్నింటినీ పరిశీలిస్తే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నానంటూ మాధబి బచ్ చేసిన వాదన ప్రశ్నార్థమవుతోందని'ది మార్నింగ్ కాంటెస్ట్' పోర్టల్ తెలిపింది.

రష్యాలో భూకంపం..

- రిచ్‌టర్ స్కేలుపై 7.0 పాయింట్లుగా నమోదు

రష్యా : రష్యాలో భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 5.25 గంటలకు కంచట్కా ద్వీపకల్పంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 7.0 పాయింట్లుగా నమోదయింది.తూర్పు తీర ప్రాంత నగరమైన పెట్రోపవ్‌లావ్‌స్కీ-కమ్‌చట్‌స్కీకి 102 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూ కంప నాభి 50 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు తెలిపింది. అయితే దీనివల్ల ప్రాణ నష్టం కానీ, ఆస్తి నష్టం కానీ సంభవించినట్లు సమాచారమేదీ లేదని అధికారులు తెలిపారు. రష్యా నౌకాదళానికి కీలక ప్రాంతమైన పెట్రోపవ్‌లావ్‌స్కీ-కమ్‌చట్‌స్కీ నగరంలో 1,80,000 మంది నివాసం ఉంటున్నారు. చుట్టూ అగ్నిపర్వతాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో అత్యధిక భాగం నావికా దళ ఆధీనంలో ఉంది. పెట్రోపవ్‌లావ్‌స్కీ-కమ్‌చట్‌స్కీకి 280 మైళ్ల దూరంలో ఉన్న షివేలుచ్ అగ్నిపర్వతం బద్దలై 8 కిలోమీటర్ల ఎత్తువరకు లావాను వెదజల్లుతున్నది. దీంతో సమీపంలో ఉన్న ప్రాంతాలు మొత్తం బూడిదమయమయ్యాయి.

చైనాతో బంధం మరింత బలోపేతం

- వియత్నాం అధ్యక్షుడు వెల్లడి
- మూడు రోజుల చైనా పర్యటన నిమిత్తం హాంకాంగ్ చేరుకున్న తో లామ్

హాంగ్‌కాంగ్/ హనోయ్ : వియత్నాం అధ్యక్షుడు తో లామ్ మూడు రోజుల చైనా పర్యటనలో భాగంగా ఆదివారం హాంగ్‌కాంగ్‌కు చేరుకున్నారు. అనంతరం అక్కడికి సమీపంలోని పారిశ్రామిక, ఎగుమతుల కేంద్రమైన గాంగ్జౌ సందర్శించారు. దక్షిణ చైనాలో మాజీ వియత్నాం కమ్యూనిస్ట్ నేత హోచిమిన్ పర్యటించిన ప్రదేశాలను కూడా లామ్ సందర్శించనున్నారని చైనా మీడియా పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇతర సీనియర్ అధికారులతో తో లామ్ భేటీ కానున్నారు. చైనా, అమెరికా, రష్యాలతో సంబంధాలను కొనసాగించడంలో ట్రాంగ్ వ్యూహాన్ని కొనసాగించాలని లామ్ భావిస్తున్నారని జింగ్జౌ యూనివర్శిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ వియత్నాం స్టడీస్ డైరెక్టర్ యు జియాంగ్‌డాంగ్ పేర్కొన్నారు. లామ్ అధికారం చేపట్టిన తరువాత జరుపుతున్న తొలి విదేశీ పర్యటనకు చైనాను ఎంచుకోవడాన్ని బట్టి చైనాతో సంబంధాలకు ఆయన అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనడానికి ఇదొక సంకేతమన్నారు. వియత్నాం అధ్యక్షుడు ఎంగుయెన్ ఫు ట్రాంగ్ (80) ఈ ఏడాది జులై 19న మరణించడంతో ఆయన స్థానంలో తో లామ్ నియుక్తులయ్యారు. వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా కూడా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బెంగళూరులో విద్యార్థినిపై అత్యాచారం

బెంగళూరు : బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినిపై ఆదివారం తెల్లవారుజామున ఒక గుర్తు తెలియని బైకర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. నగరంలోని ఒక కళాశాలలో చదువుతున్న విద్యార్థిని శనివారం రాత్రి కోరమంగళలో జరిగిన గెట్‌టుగెదర్‌లో పాల్గొనేందుకు వెళ్లింది. ఈ కార్యక్రమం తరువాత హెబ్బగొడిలోని ఇంటికి తిరిగి వెళ తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమెకు లిఫ్ట్ ఇచ్చాడు. మార్గమధ్యంలో ఆమెపై దాడికి పాల్పడి అత్యాచారం చేశాడు. లిఫ్ట్ ఇచ్చిన అనుమానితుడ్ని రేపిస్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్లు అదనపు పోలీస్ కమిషనర్ (ఈస్ట్‌జోన్) రమణ్ గుప్తా తెలిపారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితురాలు, కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు. మొత్తం సమాచారాన్ని సేకరించామని, దర్యాప్తు కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వేగంగా విచారణ సాగుతోందని, త్వరలో నిందితుడ్ని పట్టుకుంటామని చెప్పారు.

థాయి మాజీ ప్రధాని తక్‌సిన్ షినవ్రతాకు రాజు క్షమాబిక్ష

బ్యాంకాక్: థాయిలాండ్ అపర కుబేరుడు మాజీ ప్రధాని తక్‌సిన్ షినవ్రతాకు రాజు క్షమాభిక్ష ప్రసాదించారు. తన కుమార్తె ప్రధాని పదవికి పార్లమెంటు ఎన్నుకున్న మరుసటి రోజే ఈ క్షమాభిక్ష లభించింది. థాయిలాండ్‌లో అధికారం కోసం అటు రాచరికంతో జట్టుకట్టిన సైనిక జనరల్స్, థాయి ప్రభుత్వంపైన, సంస్థలపైన చాలా కాలంగా ప్రభావం చూపుతూ వచ్చిన కులక్కులతో కూడిన కూటమికి , ఇటు షినవ్రత కుటుంబం, దాని మిత్రులతో కూడిన కూటమికి మధ్య రెండు దశాబ్దాలపాటు సాగిన పోరాటంలో తక్‌సిన్ కీలక పాత్ర పోషించారు. 2006 మిలిటరీ తిరుగుబాటులో పదవీచ్యుతుడైన తక్‌సిన్ జైలు పాలుకాకుండా తప్పించుకునేందుకు విదేశాల్లో ప్రవాస జీవితం గడిపారు. నాటకీయ పరిణామాల మధ్య గత ఏడాది ఆగస్టులో ఆయన తిరిగి స్వదేశానికి వచ్చారు. 2001నుంచి 2006 మధ్య అధికారంలో ఉన్న సమయంలో తక్‌సిన్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం, అవినీతికి పాల్పడిందన్న కేసులో ఆయనకు మొదట ఎనిమిదేళ్ల జైలు శిక్ష పడింది. తరువాత దానిని రాజు మహా వజీర్ లాంగ్‌కామ్ గత సెప్టెంబరులో ఒక ఏడాదికి తగ్గించారు. ఆరుమాసాలుగా ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రి డిటెన్షన్‌లో ఉన్న ఆయన మొన్న ఫిబ్రవరిలో మెడికల్ పెరోల్‌పై విడుదలయ్యారు. ఆ పెరోల్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. రాజు పుట్టిన 1రోజు సందర్భంగా మంచి ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించారని, అందులో భాగమే ఇది అని తక్‌సిన్ తరపు న్యాయవాది వినయత్ చార్తో తెలిపారు. తక్‌సిన్ కుమార్తె పేతొంగ్తరన్ షినవ్రత(37) థాయిలాండ్ ప్రధాని పదవి చేపట్టిన అతి పిన్నవయస్కురాలు. అంతేకాదు, ఈ పదవిని అధిష్టించిన రెండవ మహిళగా కూడా ఘనత సాధించారు.. పార్లమెంటులో ఆమె పార్టీకి మూడింట రెండొంతుల మెజార్టీ ఉంది.

ఉత్తరప్రదేశ్‌లో ఘోరం

- వ్యాను, బస్సు ఢీకొని 10 మంది మృతి
- మరో 27 మందికి తీవ్రగాయాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది మరణించగా, 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. సలేంపూర్ ప్రాంతంలో బుదౌన్-మీరట్ రాష్ట్ర రహదారిపై కార్మికులతో వెళుతున్న పికప్ వ్యాన్ ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. మృతులు, క్షతగాత్రులంతా అలీగఢ్ జిల్లాకు చెందిన వారు. ఘజియాబాద్‌లోని ప్రముఖ బిస్కెట్ కంపెనీలో పనిచేస్తున్న వీరు రక్షాబంధన్ సందర్భంగా వ్యాన్‌లో సొంతవూరుకు వెళ్తూ, ప్రమాదం బారినపడ్డారు. ప్రమాద సమయంలో తామంతా నిద్రలో ఉన్నామని వ్యాన్, బస్సు ఢీకొన్నప్పుడు పెద్ద శబ్దం వచ్చిందని, అంతలోనే తీవ్ర గాయాల పాలయ్యామని కొందరు క్షతగాత్రులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించారు.

మాట్లాడుతున్న సీనియర్ అడ్వకేట్ జాహాఆరా

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

- అవాజ్ రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, తక్షణమే సవరణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణల బిల్లును వ్యతిరేకిస్తూ గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. అవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎస్.సుభాన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీనియర్ అడ్వకేట్ జాహాఆరా, సుప్రీం కోర్టు న్యాయవాది సురేష్, హైకోర్టు న్యాయవాది బి.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. సురేష్ మాట్లాడుతూ దాతలు ఇచ్చిన స్థలాల నుండి వచ్చిన ఆదాయాన్ని ప్రజల సంక్షేమానికి ఉపయోగించటానికి ఉద్దేశించిన వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేస్తూ, వక్ఫ్ ఆస్తులపై కలెక్టర్లకు విచక్షణాధికారులు ఇస్తూ సవరణ చేయడం సరికాదన్నారు. ఎలాంటి అధ్యయనమూ లేకుండానే ఈ చట్ట సవరణకు పూనుకుందని వివరించారు. గతంలో వక్ఫ్‌కు ఎవరైనా దానం చేయొచ్చని, ఇప్పుడు ముస్లిములు మాత్రమే చేయాలని చెప్పడం తగదన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను కూడా చేర్చటానికి వీలుగా సవరణ చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. జహాఆరా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లిముల హక్కులనూ హరిస్తోందని, చివరికి ముస్లిముల ఆస్తి వక్ఫ్‌ను, వక్ఫ్‌లో ట్రిబ్యునల్‌కు ఉన్న అధికారాలను లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని చెప్పారు. ట్రిబ్యునల్ అధికారాలను కలెక్టర్లకు అప్పగిస్తున్నారని, వక్ఫ్ యాక్ట్‌ను నిర్వీర్యం చేయటానికి ఈ సవరణ చేస్తోందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా వక్ఫ్‌కు ఉన్న 9.4 లక్షల ఎకరాల భూములను కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తోందని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణపై రాష్ట్రాల అభిప్రాయం తీసుకోలేదని, ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధని వివరించారు. అనంతరం చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సదస్సులో అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్తీ, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మతీన్, అవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.బాషా, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి, మిల్లీ కౌన్సిల్ నాయకులు ముఫ్తి ఆసిఫ్, వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్

- కమలా హారిస్ అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన
- గాజాలో కాల్పుల విరమణ, అబార్షన్ హక్కుల కోసం ప్రదర్శనకు వేలాదిమంది సిద్ధం

చికాగో : డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ సోమవారం చికాగోలో ప్రారంభం కానుంది. ఇందుకోసం అమెరికా నలుమూలల నుంచి పార్టీ ప్రతినిధులు, అధికారులు ఇప్పటికే చికాగో చేరుకున్నారు. ఈ కన్వెన్షన్ గురువారం వరకూ జరగనుంది. ఈ కన్వెన్షన్‌లోనే అధ్యక్ష ఎన్నికల కోసం కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. అధ్యక్ష ఎన్నికల బరిలో నుంచి జోబైడెన్ అనూహ్యంగా తప్పుకున్న తరువాత నుంచి కమలా హారిస్‌కే పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. దీన్ని ఈ కన్వెన్షన్‌లో అధికారంగా ప్రకటించనున్నారు. మరోవైపు కన్వెన్షన్ కోసం ఉద్యమకారులు కూడా ఎదురుచూస్తున్నారు. గాజాలో కాల్పుల విరమణ, అబార్షన్ హక్కుల రక్షణ, ఆర్థిక అసమానతలు వంటి అంశాలపై భారీ సంఖ్యలో ఉద్యమకారులు ఆందోళనలు నిర్వహిస్తారనే అంచనాలు ఉన్నాయి. జులైలో మిల్వాకీలో జరిగిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్ నుంచి తాము చాలా పాఠాలు నేర్చుకున్నామని, ఈ పాఠాలతో చికాగోలో భారీఎత్తున, బలమైన ప్రదర్శనలు జరుపుతామని ఉద్యమకారులు చెబుతున్నారు. కన్వెన్షన్ సాగే ప్రతిరోజూ తమ ప్రదర్శనలు కూడా ఉంటాయని తెలిపారు.

సునీతా విలియమ్స్‌కు ఆరోగ్య సమస్యలు

వాషింగ్టన్: బోయింగ్ స్టార్‌లైనర్ ప్రోబ్ విఫలమై అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకున్న సునీత విలియమ్స్‌కు ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లు సమాచారం. దృష్టి మాంద్యం వంటి సమస్యలు ఆమెను ఇబ్బంది పెడుతున్నాయి. సునీత , ఆమె సహచరుడు బచ్ విల్మోర్‌ను తిరిగి భూమికి తీసుకురావడానికి నాసా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని నాసా అధికారికంగా ధ్రువీకరించలేదు. బోయింగ్ స్టార్ లైనర్‌ను జూన్5న ప్రారంభించారు. ప్రోబ్స్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా వీరిద్దరూ మిషన్‌లో పాల్గొన్నారు. అంతరిక్ష కేంద్రానికి వెళ్లే సమయంలో ప్రోబ్‌లో లీక్ ఏర్పడింది. జూన్6న కేంద్రానికి చేరుకోగా, సాంకేతిక లోపంతో తిరుగు ప్రయాణం ఆలస్యమైంది. స్టార్ లైనర్ కు మరమ్మతు చేయడానికి చేసిన యత్నాలు ఇంకా విజయవంతం కాలేదు. ఇంతలో సునీతకు ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి.

Piramal Finance

పిరమాల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సిఐఎన్ : L65910MH1984PLC032639
నమోదిత కార్యాలయం: యూనిట్ నం.601, 6వ అంతస్తు, పిరమల్ అమితి భవనం, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, కమని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురు, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబై-400070-టి+91 22 3802 4000
శాఖ కార్యాలయం: డో.నం.7-1-615, 616 మరియు 617/ఎ, ఇంపీరియల్ టవర్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట మెయిన్ రోడ్డు, హైదరాబాద్-500016. తెలంగాణ

సంప్రదించాల్సిన వ్యక్తి : 1. దుర్గ విజయప్రసాద్ వనచర్ల-493330003, 2. రమణారావు-9849271633, 3. విశాల్ కెటెలె-9584966653.

ఇ-వేలం విక్రయ నోటీసు- తాజా అమ్మకం

పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌ను సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2022 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద రుణగ్రహీత/ల నుండి బకాయిల రికవరీ కొరకు స్వాధీనం చేసుకోవడం జరిగినది. 'ఎక్కడ ఉందో అక్కడే", "ఆధారం ఏమిటి" మరియు "ఏది ఉందో అదే" ప్రాతిపదికన స్థిరాస్తి కొనుగోలు ఏదైతే భౌతిక స్వాధీనంచేసుకొన్న దిగువసంతకందారు ద్వారా ఆఫర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరాలు దిగువ విధంగా ఉన్నవి:

లోన్ కోడ్/శాఖ/ రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీత(లు)/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి చిరునామా - ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు డిపాజిట్ మొత్తం (ఇఎమ్‌డి) (10 శాతం ఆర్‌పి)	బకాయి మొత్తం (12.08.2024)
లోన్ కోడ్ నం.: 02400006378 విజయవాడ (శాఖ), తవితి నాయుడు గార (రుణగ్రహీత), కుమారి గార (సహ రుణగ్రహీత 1)	Dt: 14-06-2021 Rs. 13,58,117/- (పదమూడు లక్షల యాభై ఎనిమిది వేల ఒక వందా పదిహేడు రూపాయలు మాత్రమే)	ఆంధ్రప్రదేశ్-521108, కృష్ణ, ప్రసాదంపాడు, విజయవాడ, స్టాన్స్ స్కూల్ ప్రక్కన, వాటర్ ట్యాంక్ రోడ్డు, సాయి గణేష్ నిలయం, రెండవ అంతస్తు, ఎస్‌ఎఫ్-1, డో.నం.9-177/2 వైపు ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఉన్న పరిధి సరిహద్దులు : ఉత్తరం : ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నం. మధ్య ఉమ్మడి గోడ, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : కామన్ కారిడార్ మరియు ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై	Rs. 12,96,000/- (పన్నెండు లక్షల తొంభై ఆరు వేల రూపాయలు మాత్రమే)	Rs. 1,29,600/- (ఒక లక్షా ఇరవై తొమ్మిది వేల ఆరు వందల రూపాయలు మాత్రమే)	Rs. 22,24,265/- (ఇరవై రెండు లక్షల ఇరవై నాలుగు వేల రెండు వందల అరవై ఐదు రూపాయలు మాత్రమే)
లోన్ కోడ్ నం.: 02400004647 విజయవాడ (శాఖ), సింహాచలం తాటపుడి (రుణగ్రహీత), మంగ తాటపుడి (సహ రుణగ్రహీత 1)	Dt: 12-05-2021 Rs. 20,04,835/- (ఇరవై లక్షల నాలుగు వేల ఎనిమిది వందల ముప్పై ఐదు రూపాయలు మాత్రమే)	ఆంధ్రప్రదేశ్ ఐఎన్-521108, కృష్ణ, దేవి ప్లాజా వద్ద, కోళ్లఫారం రోడ్డు, ఆర్ఎస్.నం.88/1, డో.నం.6-64, శ్రీ లక్ష్మి సాయి టవర్స్ ఎస్ఎ ఒకటవ అంతస్తు ఫ్లాట్ నం.ఎఫ్ ఎఫ్ 1, డో.నం.6-64, ఆర్ఎస్.నం.88/1 ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఉన్న పరిధి.	Rs. 20,33,910/- (ఇరవై లక్షల ముప్పై మూడు వేల తొమ్మిది వందల పది రూపాయలు మాత్రమే)	Rs. 2,03,391/- (రెండు లక్షల మూడు వేల మూడు వందల తొంభై ఒక్క రూపాయలు మాత్రమే)	Rs. 30,92,615/- (ముప్పై లక్షల తొంభై రెండు వేల ఆరు వందల పదిహేను రూపాయలు మాత్రమే)

ఇ-వేలం తేది: 24.09.2024, ఉ॥11.00గం.ల నుండి మ॥2.00గం.ల వరకు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో), బిడ్ దాఖలుచేయుటకు చివరి తేది: 23.09.2024, సా॥ 4.00గం.లకు ముందు.

అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు, దయచేసి అందించిన లింక్ **www.piramalfinance.com/e-Auction.html** లేదా మా ఇ మెయిల్ **piramal.auction@piramal.com** ను చూడవచ్చును.

రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారుకు సర్ఫేసీ యాక్ట్ క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకపు ప్రకటన

పై పేర్కొన్న రుణగ్రహీత/హామీదారును ఇందుమూలంగా పేర్కొనుట ఏమనగా, వేలం తేదీకి ముందు తేదీ వరకు వర్తించు వడ్డీతో పూర్తిగా సెక్షన్ 13(2)లో పేర్కొన్నట్లుగా మొత్తాలను చెల్లించవలెను, విఫలం చెందిన ఏదైతే ఆస్తిని వేలం/అమ్మకం జరుపబడుతుంది మరియు మిగతా బకాయిలను రుణగ్రహీత/హామీదారు నుండి వడ్డీ & ఖర్చులతో రికవర్‌చేయబడుతుంది.

తేది: 19.08.2024
ప్రదేశం: కృష్ణ

సం/- (అధీకృత అధికారి),
పిరమల్ క్యాపిటల్ మరియు హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

GRIHUM HOUSING FINANCE Apna Ghar, Apni Pehchan.

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
నమోదిత కార్యాలయం: 602, 6వ అంతస్తు, జీరో ఒన్ ఐటి పార్క్, ఎస్ఆర్. నం.79/1, ఘోర్పడి, ముంధ్వా రోడ్, పూణే-411036

అనుబంధం IV [రూల్ 8(1) చూచుట]
స్వాధీనత నోటీసు
(స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జి ఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ తో విలీనం చేయబడింది) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "సదరు చట్టం"గా సూచించబడుతుంది) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, పైన కార్పొరేట్/నమోదిత కార్యాలయం యొక్క ఇకపై సెక్యూర్ క్రెడిటార్‌గా సూచించబడే ఆధీకృత అధికారి సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీతలను పిలుస్తూ దిగువ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. రుణగ్రహీతలు మొత్తం తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తిని 23 జనవరి, 2024న దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవలెను. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు ఆహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను. స్వాధీనత తీసుకున్న ఆస్తి వివరాలు దిగువన ఇవ్వబడినాయి:

క్ర. సం.	రుణగ్రహీతల పేరు	ఆస్తి వివరణ	స్వాధీనం తీసుకున్న తేది	డిమాండ్ నోటీసు చట్టబద్ధత తేది	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
3.	షేక్ డాల, షేక్ గౌసియా పర్వీన్	గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, పిన్‌కోడ్-522001, ఆనందపేట, 5వ లైన్, మదర్ థెరిసా స్కూల్, పాత వార్డు నం.9 యొక్క మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ బ్లాక్ నం.11, టి.ఎస్.నం.774, మూల్యాంకనం నం.24978, డో.నం.17-8-62 కొలత 57 చ.గ.లు. హద్దులు : తూర్పు : మహబూబ్ ఖాన్ ఆస్తి, పడమర : ఎస్‌కె. నాగుల్ మీర ఆస్తి, ఉత్తరం : మున్సిపల్ రోడ్డు, దక్షిణం : ఫరీద్‌బీ ఆస్తి.	16/08/2024	06/06/2024	Loan No. HL0219H15100042 Rs. 16,10,082/- (పదహారు లక్షల పది వేల ఎనభై రెండు రూపాయలు మాత్రమే) 06/06/2024 నాటికి చెల్లించవలసిన మొత్తంతో పాటు రియలైజేషన్ వరకు 14.3 శాతం పి.ఎ. వడ్డీ.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేది: 19.08.2024
సం/- అధీకృత అధికారి, గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనవాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)

కాకరకాయ



ఆదివారం అంటే నాకిష్టం
ఆదివారం భోజనం మరీ మరీ ఇష్టం
ఇంటిలోని వారందరూ ఒకటిగా కూర్చొని తింటాం
ఆ ఆదివారం కాకరకాయ కూర చూడగానే నాలో కష్టం
వద్దంటూ ప్రారంభించాను ఏడవటం
అందరూ చెప్పిందేమిటంటే కాకరకాయ ఆరోగ్యం
కోపంతో దూరంగా తోసాను నా పళ్లెం
నాలాగే అందరూ తోశారు వారి వారి పళ్లెం
కాకరకాయ తినడమంటేనే నాకు భయం
వీరికోసమైన కళ్ళుమూసుకొని తినాలన్న నిర్ణయం
లేచి వెళ్లి తెచ్చుకొన్నాను నా పళ్లెం
నోట్లో వేసుకొని కళ్ళుమూసుకొని ప్రారంభించాను మింగడం
నా పళ్లెంలో కాకరకాయ ఖాళీ కాగానే అందరిలో ఆనందం
అందరికోసం నేను తిన్నానన్న ఆలోచనతో నాలోనూ సంతోషం

- ఓట్ర ప్రకాష్ రావు,
తిరుత్తణి,
097874 46026.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలో కొన్ని లెక్కలు చేసి, వాటి సమాధానాలు ఇచ్చాం. ఖాళీగా ఉన్న చోట మీరు సమాధానాలు రాయండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ

ఘంటసాల యోగ నందిని,
5వ తరగతి,
ఎంపిపిఎస్ చటాకాయ,
కైకలూరు మండలం,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA జీవన the family

ప్రతి ఫోటో వెనుక ఓ జ్ఞాపకం.. ఓ కథ.. ఓ అనుభూతి.. దాగుంటుంది. అలనాటి జ్ఞాపకాల్ని మళ్ళీ మళ్ళీ తనివితీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చే తీపిగురుతులు ఫొటోలు మాత్రమే. వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఫోటో చెబుతుంది. వర్తమాన అంశాలని భవిష్యత్ తరాలకు అందిస్తుంది. మధుర జ్ఞాపకాలని తరతరాలకి భద్రపరుస్తుంది. పండుగలు, పబ్బాలు, వివాహాలు, వేడుకలు, విహారాలు, విషాదాలు, సాహసాలు...ఇలా అన్నిటికీ ఫోటో సాక్ష్యంగా నిలుస్తుంది. ఇలాంటి ఫొటో గ్రఫీ వృత్తిలో దశాబ్దాలుగా పనిచేస్తున్న పూడిమూడి రాజు, కుంచం రాజేశ్, బచ్చు ఆంజనేయులు ఆదర్శప్రాయంగా పనిచేస్తున్నారు. ఆయా కాలాల్లో వారికి వృత్తిలో ఎదురైన కొన్ని సంఘటనలను ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మననం చేసుకుందాం.

తీపిగుర్తుల 'వీక్షణం'

జర్నలిస్టుగా సామాజిక స్పృహ, ప్రాపంచిక దృక్పథం, సృజనాత్మకత, వార్తల్లో చైతన్యపరమైన స్ఫూర్తి భావాన్ని 'ప్రజాశక్తి' దినపత్రిక నుంచి నేర్చుకున్నా. నేటికీ అభ్యుదయ దృష్టితోనే నా వృత్తిజీవితాన్ని గడుపుతున్నా. ఎన్నో ఆటుపోట్లు...నిర్బంధాలు, దమనకాండలను ఫొటో జర్నలిస్టుగా ఎదుర్కొన్నా. మాది సాధారణ మధ్యతరగతి కుటుంబం. పూడిమూడి వెంకన్న, సత్యవతి దంపతుల కుమారుడిని. డిగ్రీ వరకూ చదువుకున్నా. చదువుకునేటప్పుడు సెలవురోజుల్లో పొలం పనులు, బైండింగ్, వెల్డింగ్ వర్కులకు వెళ్లేవాడిని. 10వ తరగతిలో ఆనంద్ స్టూడియోలో ఫొటోగ్రఫీలో కొన్ని మెళకువలను నేర్చుకున్నా. ఈ క్రమంలో 1996లో ఫ్రీలాన్సర్‌గా కృష్ణాపత్రిక, ఇండియన్ ఎక్స్‌ప్రెస్-ఆంధ్రప్రభకు నేను తీసిన ఫొటోలు పంపిస్తే వాళ్లు వారాంతంలో వేసేవాళ్లు. విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో ఇంటర్ చదివే రోజుల్లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకత్వ బాధ్యతల్లో పనిచేశా. 1998లో జనవరిలో ప్రజాశక్తి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ విశాఖ ఎడిషన్ కేంద్రంలో చేరి 2002 వరకూ పనిచేశా. 2002లో ఆంధ్రజ్యోతి పున:ప్రారంభం సందర్భంగా ఆ పత్రికలో హైదరాబాద్‌లో చేరి 2004 వరకూ పనిచేశా. అదే ఏడాది హిందూ పత్రిక విజయవాడ కేంద్రంలో స్ట్రింగర్‌గా చేరా. అప్పటి నుంచి కొనసాగుతున్నా. ప్రస్తుతం స్పెషల్ న్యూస్ ఫొటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్నా. గత 26 సంవత్సరాలుగా ఫొటో జర్నలిస్టుగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నా. ఎన్నో నిర్బంధాలను చవిచూశా. వివిధ ఆందోళనల సమయాల్లో పోలీసులు పలు సందర్భాల్లో లాఠీలు ఝుళిపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

విద్యుత్‌ఛార్జీలకు వ్యతిరేకంగా 2000లో హైదరాబాద్‌లో తొమ్మిది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో పోలీసులు బషీర్‌బాగ్ ప్రాంతంలో కాల్పులు జరిపారు. ఈ వార్త కవరేజ్ జీవితంలో భయానక ఘటన. టియర్ గ్యాస్ షెల్స్, గుర్రాలతో తొక్కించటం, ముళ్లకంచెలతో దిగ్బంధనాలు. అలాంటి భయానక పరిస్థితుల్లో ఫొటోలు తీయటం ప్రాణాలకు తెగించటమే అవుతుంది. ప్రజాశక్తి ద్వారా జర్నలిజంలో ఓనమాలు నేర్చుకున్నా. అవే ప్రామాణికాలుగా కొనసాగుతున్నా. జర్నలిజంలో నేను చేస్తున్న కృషికి గాను జాతీయస్థాయిలో 10, రాష్ట్రస్థాయిలో 20, జిల్లాస్థాయిలో అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్నా. అమెరికా సంస్థ ఎపిసిఎస్ ఇమేజ్ కళాశాల ద్వారా గౌరవ గుర్తింపును పొందా.

జాతీయ రహదారుల అభివృద్ధి (ఎన్‌హెచ్‌ఎఐ-న్యూఢిల్లీ), స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ద్వారా ప్రథమ బహుమతులు అందుకున్నా.

ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (న్యూఢిల్లీ) జాతీయస్థాయిలో మొదటిబహుమతిని పూర్వ ఇస్రో చైర్మన్ కస్తూరి రంగరాజన్ చేతులమీదుగా తీసుకున్నా. రాష్ట్ర ముఖ్యమంత్రుల చేతులమీదుగా రాష్ట్రస్థాయి అవార్డులను అందుకున్నా. విజయవాడ కృష్ణలంకలో ఏడాదిన్నర వయస్సున్న బాలుడి గుండెకు చిల్లుబడిన నేపథ్యంలో నేను ఫొటో తీయగా సీనియర్ రిపోర్టర్ సుజాతవర్మ రాసిన వార్త, ఫొటోకు అమెరికాకు చెందిన దాత స్పందించి ఆపరేషన్‌కు అయిన ఖర్చును భరించారు.

పూడిమూడి పెద్ది రాజు
స్పెషల్ న్యూస్ ఫొటోగ్రాఫర్, ది హిందూ, విజయవాడ.

దయనీయ జీవితాలపై డాక్యుమెంటేషన్

నా తల్లితండ్రులు కుంచం సుబ్బారావు, రమణమ్మ. ఇద్దరూ ఉద్యమ నేతలే. సనాతన కుటుంబంలో పుట్టిన మా అందరికీ కులాంతర వివాహం చేశారు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రజాశక్తి పేపర్ వేస్తూ స్కూలుకు వెళ్లేవాడిని. ఆ తర్వాత పార్టీ పనుల్లో నాయకులకు సహాయం అందించా. విద్యుత్ పోరాటం, గంగవరం పోర్టు నిర్మాణంలో మత్స్యకారుల పరిహారం, విఎస్‌ఈజెడ్ కార్మికుల పోరాటాల్లో పాల్గొన్నందుకుగాను 10 రోజులు జైలు జీవితాన్ని గడిపా. 2007లో ప్రజాశక్తి ఫొటోగ్రాఫర్‌గా చేరా. మొదట్లో హేళనలు ఎదుర్కొన్నా. ఆ తర్వాత వారి నుంచి ప్రశంసలు సైతం పొందా. బ్రాకెట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణ, 2010లో వైజాక్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతం కాకానినగర్‌లో ఫొటోలను భుజాల వరకూ నీటిలో వెళ్లి ఫొటోలు తీశా. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో ధైర్యసాహసాలు ప్రదర్శించాల్సివచ్చింది. పలుసార్లు పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొన్నా. 2016 రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు, 2018లో జాతీయ స్థాయి అవార్డు పొందా.

2016లో అప్పటి సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా సన్మానాన్ని అందుకున్నా. 2009లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మద్యం షాప్ తెరిచారని ఫొటో తీస్తే యజమాని నాపై దాడిచేశారు. అప్పుడు నాకు యాజమాన్యం అండగా నిలిచింది.

-కుంచం రాజేష్
ప్రజాశక్తి ఎడిషన్ ఫొటోగ్రాఫర్, విశాఖపట్టణం

ఎన్నో అనుభవాలు...

మాది కర్నూలు. ఇక్కడే పుట్టాను. తల్లిదండ్రులు బచ్చు కృష్ణమూర్తి, లీలావతమ్మ. గత 36 సంవత్సరాలు ఫొటో జర్నలిస్టుగా ఉన్నా. 1992 నుంచి 2000 వరకు ఈనాడు, ఆరు నెలలు పాత్ర ఆంధ్రజ్యోతి, 2001 నుంచి 2003 వరకూ ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతిలో 2003 నుంచి 2019 పనిచేశాను. 2020 నుంచి నేటి వరకూ సూర్య దినపత్రిలో ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నా. విశాలాంధ్ర, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, హిందూ, సూర్య పత్రికల్లో సుదీర్ఘకాలంపాటు పనిచేశా. కాలంలో కొన్ని అచీవ్‌మెంట్స్‌ను సాధించా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు తీసుకున్నా. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో కుప్పతొట్లలో పడేస్తున్న చిన్నారులను కుక్కలు పీక్కుతింటున్న ఫొటోలు హైలెట్ అయ్యాయి. రాయలసీమలో ఫ్యాక్షన్ హత్యల నేపథ్యంలో జరుగుతున్న గొడవలపై..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చర్చల పిలుపుకోసం శ్రీశైలం అడవుల నుంచి మావోలను పిలిపించటం

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆత్మకూరులోని పావురాలగుట్టలో హెలీకాప్టర్ ప్రమాదంపై అడవిలోకి వెళ్లి ఫొటోలు తీయటం.



-బచ్చు ఆంజనేయులు, ఫొటోగ్రాఫర్, సూర్య, కర్నూలు

సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు

పాత సినిమాలే సరికొత్తగా...'రీ రిలీజ్'



సినిమా పరిశ్రమలో ప్రస్తుతం 'రీ రిలీజ్' ట్రెండ్ కొనసాగుతోంది. గతంలో సూపర్‌హిట్టయిన సినిమాలు బాక్సాఫీసు వద్ద మళ్లీ సందడి చేస్తున్నాయి. గతంలో 'రీళ్లు'లో సందడిచేసిన చిత్రాలు సైతం ఇప్పుడు '4కే' టెక్నాలజీతో కొత్త అనుభూతి పొందుతున్నాయి. ఈ తరం ప్రియులను నాటి తరంలోకి తీసుకెళ్తున్నాయి. టాలీవుడ్‌లో ట్రెండ్‌గా మారిన ఈ 'రీ రిలీజ్' గురించి విశేషాలను తెలుసుకుందాం.

గతంలో హిట్ చిత్రాలు సృష్టించిన ప్రభంజనం గురించి విని, ఆ అనుభూతి పొందాలనే నేటి యువత ఆసక్తే 'రీ రిలీజ్'కు కారణంగా చెప్పొచ్చు. ఏదైనా సినిమాని టీవీలోనో, ఓటీటీలోనో చూసి ఇంత బాగున్న చిత్రం తాను చూడలేకపోయాననే ఫీలింగ్‌ను నివృత్తి చేసుకోవటానికి రీరిలీజ్ మూవీస్ దోహదపడుతున్నాయి. బాల్యంలోనూ..ఏదైనా సందర్భంలో చూడలేకపోయిన వారు మళ్లీ 'వెండితెర'పై చూడటానికి ఇది దోహదపడుతుంది. తమ అభిమాన హీరో కొత్త సినిమా రావటం ఆలస్యమైనప్పుడూ ఈ రీరిలీజ్ సినిమాలు ఊరటనిస్తున్నాయి. కష్టకాలంలో థియేటర్లలో ఆక్యుపెన్సీ పెంచుకోవటానికి కూడా ఈ విధానం దోహదపడుతుంది. మనదేశంలోనే కాదు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడాలోని తెలుగు ప్రేక్షకులు వీటిని ఆస్వాదిస్తున్నారు.

'పోకిరి'తో నాంది

బ్లాక్ అండ్ వైట్‌లో రూపొందిన 'మాయాబజార్' లాంటి క్లాసిక్స్ రంగులద్దుకుని, ఇప్పటి ప్రేక్షకులనూ మెప్పించిన సంగతి తెలిసిందే. నేడు ఆధునిక సాంకేతిక '4కే'తో 'రీళ్ల'లో రూపొందిన చిత్రాలు డిజిటల్‌లోకి మారుస్తున్నారు. దీనికి 'పోకిరి' నాంది పలికింది. 18 ఏళ్ల క్రితం విడుదలైన ఈ ట్రెండ్ సెట్టర్ ఫిల్మ్‌ని రీ మాస్టర్ చేసి యూఎస్‌లో రీ రిలీజ్‌ను ప్రకటించగా క్షణాల్లోనే ప్రీ బుకింగ్ టిక్కెట్లు అమ్ముడుపోయాయి. స్పందన బాగుండటంతో ఈ విధానాన్ని మనదేశంలోనూ ప్రారంభించారు. మహేష్‌బాబు హీరోగా నటించిన ఈ సినిమా ఆయన పుట్టినరోజు సందర్భంగా 2022 ఆగస్టు 9న విడుదలైన మరోసారి సత్తా చాటింది. పవన్‌కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'జల్సా' ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని సెప్టెంబర్ 1న రీ రిలీజ్ చేశారు. 22 ఏళ్ల క్రితం హిట్ అందుకున్న బాలకృష్ణ 'చెన్నకేశవరెడ్డి' రీరిలీజ్ అయ్యింది. ప్రభాస్ 'బిల్లా', చిరంజీవి 'ఇంద్ర', జగదేక వీరుడు...అతిలోక సుందరి, మహేశ్‌బాబు అతడు, ఖలేజా, ఎన్టీఆర్ ఆది తదితర చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి.

వసూళ్ల జోరు

రీమాస్టరింగ్ చేసేందుకు ఒక్కో సినిమాకు రూ.8 లక్షలు వరకూ ఖర్చవుతుంది. ఆ మూవీ రిలీజై రూ.కోట్లు వసూలు చేస్తుంది. పోకిరి, జల్సా ఇలాగే కోట్లలో వసూలు చేశాయి. ఆణిముత్యాల్లాంటి సినిమాలను భావితరాలకు అందించేందుకు ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థలు, థియేటర్ యాజమాన్యాలు రీ రిలీజ్‌పై మొగ్గుచూపుతున్నాయి.

స్టార్ హీరోల సినిమాల కోలాహలం

ఈనెలలో స్టార్ హీరోల సినిమాల రీరిలీజ్‌ల కోలాహలం కొనసాగుతోంది. దర్శకుడు రాజమౌళి నేతృత్వంలో హీరో రవితేజ నటించిన చిత్రం 'విక్రమార్కుడు' తాజాగా రీ రిలీజ్ అయ్యింది. ఈనెల 9న హీరో మహేశ్‌బాబు పుట్టిన రోజును పురస్కరించుకుని 'మురారి', 'ఒక్కడు' సినిమాలను విడుదల చేశారు. చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 22, అక్కినేని నాగార్జున పుట్టిన రోజును పురస్కరించుకుని మరికొన్ని సినిమాలు విడుదలకాబోతున్నాయి.

మహేష్‌బాబు హీరోగా, సోనాలీబింద్రే హీరోయిన్‌గా నటించి 2001లో విడుదలైన 'మురారి' సినిమా ఈనెల తొమ్మిదో తేదీన మళ్లీ విడుదలైంది. మహేశ్‌బాబు హీరోగా భూమిక చావ్లా కలిసి నటించిన చిత్రం 'ఒక్కడు'. ఈనెల ఎనిమిదోతేదీన విడుదలైంది. ప్రకాశ్‌రాజ్ విలన్‌గా, మణిశర్మ సంగీతం అందించారు. గుణశేఖర్ ఈ సినిమాను రూపొందించారు. హీరో చిరంజీవి నటించి బాక్సాఫీసు వద్ద రికార్డులు తిరగరాసిన చిత్రం 'ఇంద్ర'. 2002లో విడుదలైంది. హీరోయిన్లుగా ఆర్తి అగర్వాల్,సోనాలీబింద్రే నటించారు. బి.గోపాల్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా అప్పట్లో రికార్డుల వర్షం కురిపించింది. మూడు నంది, రెండు ఫిలింఫేర్ అవార్డులను గెల్చుకుంది. ఈనెల 22న రీ రిలీజ్ కానుంది. హీరో నాగార్జున, హీరోయిన్‌గా అమల నటించిన చిత్రం 'శివ'. రామ్‌గోపాలవర్మ తీసిన హిట్ సినిమాల్లో ఇదొకటి. ఈనెల 29న రీ రిలీజ్ కానుంది. 1980లో వచ్చిన ఈ సినిమా కళాశాల డ్రాప్‌లో సాగుతుంది. అక్కడ జరిగే గొడవలు, కళాశాలలో యువత సందడి, అప్పట్లో బాగా ఈ సినిమా ఆడింది. ఈనెల 29న అక్కినేని నాగార్జున పుట్టినరోజు. తన అభిమానుల కోసం 'మాస్' సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. అక్కినేని నాగార్జున హీరోగా, రాఘవ లారెన్స్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ మూవీ మళ్లీ వెండితెరపై సందడి చేయనుంది. నాగార్జున సొంత బ్యానర్ అన్నపూర్ణ స్టూడియోస్ తెరకెక్కించిన ఈ సినిమా 2004లో విడుదలైంది. ఈ మేరకు అధికారికంగా ఒక పోస్టర్‌ను కూడా మేకర్లు విడుదల చేశారు. ఈ సినిమాలో జ్యోతిక, చార్మికౌర్, రఘువరన్, ప్రకాశ్‌రాజ్, రాహుల్‌దేవ్ కీలకపాత్రలు పోషించారు.

అది మానని గాయం!

- **పారిస్ ఒలింపిక్స్‌పై**
వినేశ్ ఫోగట్

చండీగఢ్ : పారిస్ ఒలింపిక్స్ నుంచి స్వదేశం చేరుకున్న వినేశ్ ఫోగట్ అభిమానుల అపూర్వ ఆదరణ, ప్రేమాభిమానులను చూరగొన్నది. మహిళల 50 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న వినేశ్ ఫోగట్ కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నది. కానీ పసిడి పోరుకు ఉదయం బరువు ఓ 100 గ్రాములు అధికంగా ఉన్నది. దీంతో ఒలింపిక్స్ నిర్వహణ కమిటీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్‌లు వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు వేయటంతో పాటు ఆమె నుంచి సిల్వర్ మెడల్‌ను సైతం లాగేసుకున్నారు. ఈ నిర్ణయాన్ని కాస్ (కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్)లో వినేశ్ ఫోగట్ సవాల్ చేసింది. వినేశ్ ఫోగట్ తరపున ఫ్రెంచ్ న్యాయవాదులు వాదనలు వినిపించగా.. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సైతం వినేశ్ ఫోగట్‌కు మెడల్ ఇవ్వాలని వాదించింది. తీర్పును మూడుసార్లు వాయిదా వేసిన కాస్ న్యాయమూర్తి.. ఆఖరుకు వినేశ్ ఫోగట్ అప్పీల్‌ను తిరస్కరించారు. సంయుక్త రజత పతకం ఇవ్వటం కుదరదని తేల్చిచెప్పారు. కాస్ తీర్పు కోసం పారిస్‌లోనే ఉండిపోయిన వినేశ్ ఫోగట్ కాస్త ఆలస్యంగా శనివారం స్వదేశం చేరుకున్న సంగతి తెలిసిందే. ఉదయం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న వినేశ్ ఫోగట్.. అర్ధరాత్రి అనంతరం స్వగ్రామం చేరుకుంది. స్వగ్రామానికి వినేశ్ ఫోగట్ ప్రయాణం ర్యాలీగా సాగగా.. దారిపొడవునా అభిమానులు, ప్రజల ప్రేమాభిమానులతో వినేశ్ తీవ్ర భావోద్వేగానికి గురైంది.

స్వగ్రామంలో ప్రజలు బంగారు పతకం బహూకరించిన అనంతరం వినేశ్ ఫోగట్ భావోద్వేగంగా మాట్లాడింది. 'ఇంతటి అభిమానం, ప్రేమకు నేను అర్హురాలు అవునో కాదో నాకు తెలియదు. ఇటువంటి ప్రాంతంలో పుట్టినందుకు ఎంతో అదృష్టవంతురాలిగా భావిస్తున్నాను. ఈ గ్రామంలో నా సహచర సోదరీమణులకు మల్లయుద్ధం శిక్షణ ఇస్తాను. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పతకాలు సాధించగల రెజ్లర్లను సిద్ధం చేస్తాను. మీ అందరి ప్రేమ, అభిమానానికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. పారిస్ ఒలింపిక్స్ పతకం దక్కకపోవటం లోతైన గాయం చేసింది. ఆ వేదన నుంచి కోలుకునేందుకు సమయం పడుతుంది. కానీ నా దేశ ప్రజలు, నా గ్రామ ప్రజల ప్రేమతో ఆ గాయం త్వరగా నయం అవుతుందని అనుకుంటున్నాను' అని వినేశ్ ఫోగట్ అన్నారు.

వినేశ్‌కు స్వర్ణం

- **గోల్డ్ మెడల్ ప్రదానం చేసిన స్వగ్రామ ప్రజలు**
- **అర్ధరాత్రి 2 గంటల వరకు కొనసాగిన ర్యాలీ**

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు అపూర్వ గౌరవం లభించింది. పారిస్ ఒలింపిక్స్‌లో సంయుక్త సిల్వర్ మెడల్ విజేతగా నిలిచే అవకాశం కోల్పోయిన వినేశ్ ఫోగట్‌ను స్వగ్రామ ప్రజలు హృదయానికి హత్తుకున్నారు. మహిళల 50 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగం ఫైనల్‌కు చేరుకునే క్రమంలో ముగ్గురు రెజ్లర్లను మట్టికరిపించిన వినేశ్ ఫోగట్‌కు బంగారు పతకం బహూకరించారు. శనివారం అర్ధరాత్రి అనంతరం స్వగ్రామం బాలాలీ చేరుకున్న వినేశ్ ఫోగట్‌కు ఘన స్వాగతం లభించింది. గ్రామంలోని మహిళలు, యువత, గ్రామ పెద్దలు వినేశ్ ఫోగట్‌ను పూల దండలతో ఆహ్వానించారు. బరువు తగ్గే క్రమంలో అనారోగ్యానికి గురైన వినేశ్ ఫోగట్ పూర్తి ఆరోగ్యం సాధించాలని ఆమెకు దారిపొడవునా ప్రజలు పాలు అందించారు. గతంలో బాలాలీ గ్రామ ప్రజలు ప్రకటించి నట్టుగా.. వినేశ్ ఫోగట్‌కు బంగారు పతకం ప్రదానం చేశారు. వినేశ్ ఫోగట్‌కు పతక ప్రదాన కార్యక్రమం శనివారం అర్ధరాత్రి 2 గంటలకు ముగిసింది. అప్పటి వరకు బాలాలీ గ్రామ ప్రజలతో పాటు అభిమానులు, సమీప గ్రామాల నుంచి ప్రజలు వినేశ్ ఫోగట్ ర్యాలీలో పాల్గొన్నారు.



మెల్‌బోర్న్‌లో 150 ఏళ్ల టెస్టు సంబరం!

న్యూఢిల్లీ : ప్రపంచ టెస్టు క్రికెట్ తొలి మ్యాచ్ 150వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) సిద్ధమైంది. 1877లో మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ప్రథమ టెస్టు మ్యాచ్‌లో పోటీపడ్డాయి. 1977లో మెల్‌బోర్న్‌లోనే తొలి టెస్టు శతాబ్ది ఉత్సవాన్ని నిర్వహించగా.. తాజాగా 2027 మార్చిలో తొలి టెస్టు 150వ వార్షికోత్సవం జరుపనున్నారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తలపడతాయని సీఏ వెల్లడించింది. టెస్టు క్రికెట్ తొలి టెస్టులో ఆసీస్ 45 పరుగులతో గెలుపొందగా, 1977లోనూ ఆసీస్ 45 పరుగుల తేడాతో విజయం సాధించింది.

భారత్, ఆస్ట్రేలియాను అధిగమించి దక్షిణాఫ్రికా ప్రపంచ రికార్డు

- **టెస్టు క్రికెట్‌లో ఒక జట్టుపై**
వరుసగా అత్యధిక సిరీస్‌లు కైవసం

టెస్టు క్రికెట్‌లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. తాజాగా విండీస్‌తో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది. తొలి టెస్టు డ్రాగా ముగిసింది. ఈ సిరీస్ నెగ్గడం ద్వారా దక్షిణాఫ్రికా ప్రపంచ రికార్డు సృష్టించింది. టెస్టుల్లో ఒక జట్టుపై వరుసగా అత్యధిక (10) సిరీస్‌లు నెగ్గిన టీమ్‌గా అవతరించింది. అంతకుముందు ఈ రికార్డు టీమిండియా (9), ఆస్ట్రేలియా (9) పేరిట సంయుక్తంగా ఉండేది. ఆసక్తికర విషయం ఏంటంటే.. భారత్, ఆస్ట్రేలియా కూడా వెస్టిండీస్‌పైనే ఈ రికార్డును నెలకొల్పాయి. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా మధ్య ఇప్పటివరకు 33 టెస్టులు జరిగాయి. ఇందులో దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల్లో మాత్రమే ఓడింది. ఇరుజట్ల మధ్య 1992లో జరిగిన తొలి టెస్టు సిరీస్ (ఒక మ్యాచ్)లో దక్షిణాఫ్రికా పరాజయం చవిచూసింది. కానీ, తర్వాత జరిగిన 10 సిరీస్‌లను కైవసం చేసుకుని విండీస్‌పై తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68